


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 21-07-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 271 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## పథకాలు అందేవిధంగా ప్రధాన బాధ్యతగా నడుచుకోవాలి

### బీసీ ఉప కులాల కార్పొరేషన్ల ఏర్పాటుపై సీఎం జగన్ సమీక్ష



అమరావతి: ఈ నెలాఖరు కల్లా బీసీ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్ల పోస్టుల భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బీసీ పరిధిలోని వివిధ ఉప కులాల కార్పొరేషన్ల ఏర్పాటుపై ఆయన సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రులు శంకర నారాయణ, బొత్స సత్యనారాయణ, ధర్మాన కృష్ణదాస్, మోపిదేవి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి హాజరయ్యారు. బీసీల్లోని ఆయా కులాల వారికి ప్రభుత్వ ప్రయోజనాలు అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని కార్పొరేషన్లు పర్యవేక్షించాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. అందరికీ పథకాలు అందే విధంగా ప్రధాన బాధ్యతగా నడుచుకోవాలని సీఎం సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ 2,12,40,810 మంది బీసీలకు రూ.22,685.74 కోట్ల రూపాయలను నగదు బదిలీ ద్వారా అందించామని సీఎం పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఇంత ఫోకస్‌గా గతంలో ఎవరూ, ఎప్పుడూ పని చేయలేదని సీఎం స్పష్టం చేశారు. రూపాయి లంచం, వివక్ష లేకుండా తలుపుతట్టి మరీ పథకాలు అందిస్తున్నామన్నారు. కొత్త వాటితో కలుపుకుని మొత్తంగా 52 కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. గతంలో 69 కులాలకే ప్రాధాన్యత ఇచ్చారని, ఇప్పుడు మొత్తం బీసీ కులాలన్నింటికీ కార్పొరేషన్లలో ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు.

## ఏపీ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఎప్పుడనే అంశంపై గత కొన్ని రోజులుగా చర్చ జరుగుతోంది. తాజాగా ఈ చర్చలకు తెర దించుతూ రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది.

ఈ నెల 22న మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని వెల్లడించింది. ఆ రోజున ఇద్దరు కొత్త మంత్రులు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం. ఇటీవల మంత్రి పదవులకు రాజీనామా చేసిన మోపిదేవి, పిల్లి సుభాష్ చంద్రబోస్ సామాజిక వర్గానికి చెందిన వారినే మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. రామచంద్రాపురం ఎమ్మెల్యే చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పలాస ఎమ్మెల్యే సీదిరి అప్పలరాజుకు

తరువాయి 2లో..

## అరబ్ ఆశల్ని మోసుకెళ్లిన 'హోప్'



దిల్లీ : యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మొట్టమొదటి అంగారక యాత్ర సోమవారం విజయవంతంగా ప్రారంభమైంది. జపాన్‌లోని తనెగాషిమా స్పేస్ సెంటర్ నుంచి హెచ్-11ఏ వాహక నౌక ఎమిరేట్స్ మార్స్ మిషన్‌కు చెందిన హోప్ అంతరిక్ష నౌకను మోసుకెళుతూ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ యాత్ర 200 రోజుల పాటు సాగనున్నట్లు యూఏఈ స్పేస్ ఏజెన్సీ వెల్లడించింది. అంగారక గ్రహం మీద వాతావరణ పరిస్థితుల అధ్యయనమే లక్ష్యంగా ఈ మిషన్‌ను చేపట్టారు. దాదాపు 687 రోజుల పాటు అంగారక గ్రహంపై దీని అధ్యయనం సాగనుంది. రోజువారీ వాతావరణంతో పాటు వివిధ రుతువుల్లో అక్కడి పరిస్థితులు ఎలా మార్పు చెందుతున్నాయన్న విషయంపై దీని పరిశోధన సాగనుంది. ముఖ్యంగా ఉపరితలంలో గూడు కట్టుకుని ఉన్న ధూళి కణాల లక్షణాలను ఇది పరిశీలించనుంది. ఈ కణాలే అక్కడి వాతావరణ, ఉష్ణోగ్రతలను ప్రభావితం చేస్తున్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వీటిని అధ్యయనం చేయడం ద్వారా అక్కడి వాతావరణ మార్పుల గుట్టు తెలిసే అవకాశం ఉంది. అలాగే వివిధ ప్రాంతాల్లో వాతావరణ మార్పులు ఎలా ఉన్నాయన్న దానిపై కూడా ఈ మిషన్ సమాచారం అందించనుంది. వాస్తవానికి ఈ ప్రయోగం బుధవారమే జరగాల్సి ఉండగా.. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆలస్యమైంది. అమెరికా అంతరిక్ష నిపుణుల వద్ద శిక్షణ పొందిన యూఏఈ ఇంజినీర్లు కేవలం

తరువాయి 2లో..

## 'వైజాగ్ ప్రజలను భయపెట్టాలనుకుంటున్నారా'

### చంద్రబాబుపై సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం



తాడేపల్లి: అభివృద్ధి వికేంద్రీకరణ, సీఆర్డీఏ రద్దు బిల్లులు గవర్నర్ ఆమోదానికి వెళ్లాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. నిబంధనల ప్రకారమే గవర్నర్ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. 'ప్రతిపక్ష నేత చంద్రబాబు బిల్లులను అడ్డుకోవాలని చూస్తున్నారు. ఒక ప్రాంత ప్రయోజనాల కోసమే చంద్రబాబు పనిచేస్తున్నారు. అభివృద్ధి వికేంద్రీకరణకు టీడీపీ అనుకూలమా వ్యతిరేకమా చెప్పాలి. ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధి మీకు కావాలా వద్దా ఇవాళ ఓ ప్రముఖ తెలుగు దినపత్రికలో ఒక కథనం వచ్చింది. వైజాగ్‌లో ఏదో జరిగిపోతుందని కథనంలో రాసుకొచ్చారు.

ఇలాంటి కథనాలతో వైజాగ్ ప్రజలను భయపెట్టాలనుకుంటున్నారా అక్కడి ప్రజలకు ఏం మెసేజ్ ఇవ్వాలనుకుంటున్నారు. వైజాగ్ ఏం పాపం చేసింది. వైజాగ్ ప్రజలతో రాజధాని మాకొద్దు అని చెప్పించేలాగా ఉన్నారు. ఇది మహా పాపం. మాకు రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి కావాలి. టీడీపీ వెర్షన్‌నే రాష్ట్ర బీజేపీ నేతలు చెబుతున్నారు. రాజధాని రాష్ట్ర ప్రభుత్వ ఇష్టం అని కేంద్రం చెప్పింది. విభజన చట్టానికి రాజధానికి సంబంధం

తరువాయి 2లో..

## 'అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసమే వికేంద్రీకరణ'

### మంత్రి బొత్స సత్యనారాయణ



విశాఖపట్నం: తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ఏపీ గవర్నర్‌కు రాసిన లేఖలోనివన్నీ అబద్ధాలేనని మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. విశాఖలో విలేకర్లతో మంత్రి బొత్స మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసమే వికేంద్రీకరణ నిర్ణయమన్నారు. ఒకే చోట రూ.లక్ష కోట్ల ఖర్చు సరికాదని జగన్ గతంలోనే చెప్పారని పేర్కొన్నారు. పార్లమెంట్ స్థానాలను జిల్లాలుగా మారుస్తామని ఎన్నికల ముందే హామీ ఇచ్చామని చెప్పారు.

చంద్రబాబు స్వప్రయోజనాల కోసమే కేవలం ఒక్క ప్రాంతంపైనే దృష్టి పెట్టారని బొత్స విమర్శించారు.

## గవర్నర్‌ను కలిసిన నిమ్మగడ్డ రమేశ్



అమరావతి: ఏపీ హైకోర్టు ఆదేశాలతో గవర్నర్ బిశ్వభూషణ్‌ను నిమ్మగడ్డ రమేశ్ కలిశారు. హైకోర్టు తీర్పును ఆయనకు వివరించారు. తనను తిరిగి ఎస్ఈసీగా నియమించాలంటూ ధర్మాసనం ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరారు. ఈ మేరకు గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఈసీగా తిరిగి నియమించాలన్న హైకోర్టు తీర్పును గవర్నర్‌కు తెలియజేశానన్నారు. " నా విజ్ఞాపనను గవర్నర్ సానుకూలంగా స్వీకరించారు. గవర్నర్ జోక్యంతో సానుకూల ఫలితం వస్తుందని ఆశిస్తున్నాను" అని నిమ్మగడ్డ తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర

తరువాయి 2లో..




## కోవిడ్ ఆస్పత్రుల్లో నాణ్యమైన సేవలపై ప్రత్యేక దృష్టి

### కరోనా నివారణ చర్యలపై సీఎం జగన్ సమీక్ష



తాడేపల్లి: కరోనా నివారణ చర్యలపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, సీఎస్ నీలం సాహ్ని, డీజీపీ గౌతమ్ సవాంగ్, హెల్త్ స్పెషల్ సీఎస్ జవహర్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ ఛైర్మన్ కృష్ణబాబు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్న కోవిడ్ ఆస్పత్రుల సంఖ్యను 5 నుంచి 10కి పెంచాలని సీఎం అధికారులను ఆదేశించారు. వైద్యులపై పని భారం లేకుండా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. జిల్లాల్లో ఉన్న 84 కోవిడ్ ఆస్పత్రుల్లో నాణ్యమైన సేవలపైనా ప్రత్యేక దృష్టి సాధించాలని ఆదేశించారు. ఈ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం రాయితీలు అందించాలన్నారు. ఆయా ఆస్పత్రుల్లో ఏం చేయాలనే దానిపై రెండు రోజుల్లో నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయి కోవిడ్ ఆస్పత్రుల మాదిరిగా ఈ ఆస్పత్రులు కూడా పూర్తిస్థాయి సేవలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం ఉన్న 5 రాష్ట్రస్థాయి ఆస్పత్రుల్లోనూ నాణ్యమైన సేవలకోసం సత్వర చర్యలు చేపట్టాలని.. వీలైనంత త్వరగా వైద్యులు, సిబ్బంది నియామకం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కోవిడ్ సోకిందన్న అనుమానం వస్తే ఏంచేయాలి ఎవర్ని కలవాలన్న దానిపై అవగాహనకు భారీ ప్రచారం

తరువాయి 2లో..

## తితిదే మాజీ ప్రధాన అర్చకుని కన్నుమూత


(ఫైల్ ఫోటో)

తిరుమల: కలియుగ దైవం తిరుమల శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు శ్రీనివాసమూర్తి దీక్షితులు కరోనా కారణంగా (75) కన్నుమూశారు. గత కొద్ది రోజుల క్రితం ఆయన వైరస్ బారిన పడ్డారు. తిరుపతిలోని తితిదే కొవిడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. శ్రీవారి

తరువాయి 2లో..

## 12 దేశాల్లో ఒక్క కరోనా కేసు లేదు..

దిల్లీ : ప్రపంచదేశాలను కరోనా వైరస్ గడగడలాడిస్తోంది. అతి తక్కువ కాలంలోనే వందలాది దేశాలకు విస్తరించింది. లక్షలాది మంది ప్రాణాలను కూడా హరిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా కరోనా కేసులే నమోదుకాని దేశాలు ఉన్నాయంటే నమ్మగలమా..? కానీ ఇది నిజం. ప్రపంచ వ్యాప్తంగా యూఎన్ఓ 193 దేశాలను అధికారికంగా గుర్తించింది. అందులోని 12 దేశాల్లో జూలై 19,2020 నాటికి ఎటువంటి కోవిడ్ కేసులు నిర్ధారించబడలేదు. ఈ దేశాలలో చాలా వరకు ఓషియానియాలోని పసిఫిక్

తరువాయి 2లో..

## విక్టరీ వెలమ సంఘానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తా



ములగాడ : విక్టరీ వెలమ సంఘానికి అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని 59వార్డ్ వైకాపా అధ్యక్షుడు పుర్రిసురేష్ హామీ ఇచ్చారు. మంగళవారం నూతనంగా ఏర్పాటు అయిన 59వ వార్డ్ విక్టరీ వెలమ సంఘం ప్రతినిధులు వైస్సార్సీపీ వార్డ్ అధ్యక్షులు పుర్రె సురేష్ యాదవ్ ను మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్బంగా పుర్రె సురేష్ యాదవ్ సంఘ అధ్యక్షులు రొంగలి ప్రసాద్, గౌరవ అధ్యక్షులు మడక అప్పారావును, మిగతా సభ్యులు ను శాలువా కప్పి పుష్ప గుచ్చము ఇచ్చి అభినందనలు తెలిపారు.

సంఘ సభ్యులు తమ సమస్యలను వార్డ్ అధ్యక్షులు దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా సురేష్ యాదవ్ మాట్లాడుతూ విక్టరీ వెలమ సంఘం కి అన్నివిధాలా సహాయం సహకారం అందిస్తామని మీసమస్యలను పశ్చిమ వైకాపా ఇంచార్జ్ మళ్ళా విజయ్ ప్రసాద్ గారితో చర్చించి పరిష్కారిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాగరపు శ్రీను, నాయుడు, కార్మిక నాయకులు నర్సింగ్ యాదవ్, కుంచారావు, షేక్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారాతో పట్టుబడ్డ వ్యక్తికి 14 రోజులు రిమాండ్



దేవరాపల్లి : నాటుసారాతో పట్టుబడిన వ్యక్తికి చోడవరం మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు స్థానిక ఎస్ ఐ పి. నరసింహమూర్తి తెలిపారు. దీనికి సంభందించిన వివరాలను సోమవారం ఆయన విలేకరులకు తెలిపారు. మండలంలోని దేవరాపల్లి గ్రామంలో అక్రమంగా నాటుసారా రవాణా జరుగుతుందని ముందస్తు సమాచారం రావడంతో ఎస్సై తమ సిబ్బంది రాము, వెంకటరావు సహకారంతో వెళ్లి దాడి చేయగా దేవరాపల్లి యాత పేట కు చెందిన మునస సత్తిబాబు తన ఇంటి వద్ద నాటుసారా అమ్ముతుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. సత్తిబాబు వద్ద నుంచి 14 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకోని అరెస్ట్ చేశామన్నారు. అనంతరం ముద్దాయిని చోడవరం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించడంతో తర్వాత చోడవరం సబ్ జైలుకు తరలించడం జరిగిందన్నారు.

## కోవిడ్ పేషెంట్ కు తక్షణ వైద్య చికిత్స



శ్రీకాకుళం : జెమ్స్ ఆసుపత్రిలో కోవిడ్ చికిత్స పొందుతున్న బి.మోహన రావు తనకు సరైన చికిత్స అందడం లేదని పేర్కొంటూ వాట్సప్ ద్వారా పంపించిన సందేశంపై జిల్లా కలెక్టర్ జె నివాస్ తక్షణం స్పందించారు. జెమ్స్ ఆసుపత్రి పర్యవేక్షకులు డా.హేమంత్, వైద్యులతో వెంటనే మాట్లాడి మెరుగైన చికిత్సను అందించాలని ఆదేశించారు. మోహన రావు పరిస్థితిని నిరంతరం గమనించాలని అందుకు ప్రత్యేకంగా ఒక వైద్యులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆ మేరకు వైద్యులు స్పందించి ఐ.సి.యులో ఉన్న మోహన రావుకు చికిత్సను అందించారు. వైద్యులు మోహన రావు పరిస్థితిని గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఊపిరి తీసుకునే సమయంలో ఇబ్బందిగా ఉందని ఆయన పేర్కొన్నారు. నిరంతరం వైద్య సేవలు అందించుటకు సిద్ధంగా ఉన్నామని వైద్యులు తెలియజేస్తూ ఆక్సిజన్ మాస్కును తొలగించరాదని సూచించారు. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఉందని దానిని తగ్గించుటకు ఇంజెక్షన్ ఇవ్వడం జరిగిందని మోహన రావుకు వివరించారు. అందిస్తున్న ఆహారాన్ని పూర్తిగా తీసుకోవాలని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. ధైర్యంగా ఉంటే కరోనా ఏమి చేయదని స్థైర్యాన్ని అందించారు వైద్యులు. జిల్లాలో కరోనా పేషెంట్లకు అత్యుత్తమ వైద్యం, సేవలు అందించుటకు శాయశక్తుల కృషి చేస్తున్నామని కలెక్టర్ నివాస్ అన్నారు. మోహన రావు పరిస్థితి తెలిసిన వెంటనే వైద్యులను అప్రమత్తం చేసామని పేర్కొన్నారు.

## వేచలంలో మరో కరోనా పాజిటివ్ నమోదు

- ఎన్ఆర్ఐ హాస్పిటల్ కు తరలింపు



దేవరాపల్లి : మండలంలోని కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నిన్న వేచలం పీహెచ్సీ పరిధిలో రెండు కేసులు నమోదు కాగా,వేచలం గ్రామంలో సోమవారం 65 ఏళ్ల మహిళకు కరోనా పాజిటివ్ నమోదైనట్లు వైద్యాధికారిణి బి. హారిక తెలిపారు. కరోనా పాజిటివ్ మహిళను ఎన్ఆర్ఐ హాస్పిటల్ కు తరలించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఇదే గ్రామంలో రామాలయం వీధి సమీపంలో ఓకే కంటోన్మెంట్ జోన్ లో వరుసగా మూడు కేసులు నమోదు అవడంతో ఒక్కసారిగా గ్రామంలోని ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. అదేవిధంగా దేవరాపల్లి రెండు కరోనా పాజిటివ్ నమోదు కావడంతో మండల ప్రజలను కరోనా కేసులు కలవరపెడుతున్నాయి. రోజురోజుకు పాజిటివ్ కేసుల సంఖ్య పెరగడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమై గ్రామంలో పలు చర్యలు తీసుకుంటున్నారు. గొల్లపేట, చాఖల పేట, జాలరి పేట, ఎస్ సి కాలనీ వీధిలలో కరోనా కట్టడి కోసం ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించకుండా కంచెలు వేశారు.

## ఫోన్ లో స్పందన కార్యక్రమానికి 47 వినతులు

శ్రీకాకుళం : సోమ వారం ఫోన్ ద్వారా నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 47 వినతులు అందాయి. కోవిడ్ కారణంగా వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా స్పందన కార్యక్రమాన్ని ఫోన్ ద్వారా నిర్వహిస్తున్న సంగతి విదితమే. ప్రతి సోమ వారం ఉదయం 9 నుండి 12 గంటల వరకు 08942 240605, 08942 240606, 9491222122 ఫోన్ నంబర్ల ద్వారా ప్రజలు తమ వినతులను తెలియజేసే అవకాశాన్ని జిల్లా కలెక్టర్ జె నివాస్ కల్పించారు. అర్జీలను spandanasrikakulam@gmail.com మెయిల్ ద్వారా కూడా అందజేయవచ్చు. ఇందులో భాగంగా సోమ వారం ఫోన్ ద్వారా నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 47 వినతులు అందాయి. కొత్తూరు మండలం నేతాజి నగర్ కోలని నుండి ఎల్.తులసి వరప్రసాద్ మాట్లాతూ అడ్డుబంగి గెడ్డ ఆయకట్టు నుండి వంశధార కాలువలోకి నీరు విడుదల చేయడం వల్ల 5 గ్రామాలు వరద ముంపుకు గురవుతున్నాయని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. హిరమండలం కిట్టాలపాడు గ్రామం నుండి డి.కొరమయ్య ఫోన్ చేస్తూ తన భూమిని ఎస్.రామరావు, జి.కృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు కబ్జా చేశారని, న్యాయం చేకూర్చాలని కోరారు. జలుమూరు మండలం నుండి ఎన్ పార్వతీశం సర్వే నెంబరు 365/10 లో గల తన భూమి ఇతరుల పేరున అడంగళ్ ఉందని, పేరున మార్చవలసినదిగా కోరారు. కంచిలి మండలం జలంతర కోట గ్రామం నుండి శ్యామల దేవకి ఫోన్ చేస్తూ ఇల్లు మంజూరు అయినదని, అయితే అడంగళ్ నా పేరు మీద లేనందున దానిని తన పేరుతో మార్చు చేసి ఇప్పించవలసినదిగా కోరారు. వీరఘట్టం మండలం తలవరం గ్రామం నుండి గ్రామ ప్రజలు మాట్లాడుతూ తమ గ్రామంలో విద్యుత్ ట్రాన్సుఫార్మర్ సామర్ధ్యం తక్కువగా ఉండటంతో విద్యుత్ అంతరాయం కలుగుతుందని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీకాకుళం మండలం జగన్నాధపురం కోలనికి చెందిన వి.శివప్రాద్ తన భూమిని ఇతరులు కబ్జా చేశారని, తన భూమిని ఇప్పించవలసినదిగా కోరారు. జలుమూరు మండలం కూర్మనాధపురంకు చెందిన పి.విశ్వనాధం ఫోన్ చేస్తూ ఆరు నెలల నుండి వృద్ధాప్య పింఛను అందడం లేదని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇచ్చాపురం మండలం బెల్లుపడ ఎస్సీ కోలని నుండి హేమలత లక్ష్మి ఫోన్ చేస్తూ ప్రధాన ఉపాధ్యాయులు డ్యూటీ సర్టిఫికేటు జారీ చేయకపోవడంతో జీత భత్యము అందలేదని, డ్యూటీ సర్టిఫికేటు ఇప్పించవలసినదిగా కోరారు. టెక్కలి మండలం సీతాపురం గ్రామం నుండి బెండి పోతయ్య ఫోన్ చేస్తూ సర్వే నెంబరు 244-3-26 లో భూమిని గిరి సత్యం అనే వ్యక్తి ఇతరులకు విక్రయించారని ఫిర్యాదు చేశారు. రాజాం మండలం గడిముడిదాం గ్రామం నుండి యం.కిరణ్ కుమార్ ఫోన్ చేస్తూ తన సోదరునికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని తమ కుటుంబానికి రేషన్ ఇవ్వడం లేదని, తగు చర్య తీసుకోవాలని కోరారు. వజ్రపు కొత్తూరు మండలం మాదవపురం గ్రామం నుండి వి.గోపాలరావు స్పందన కార్యక్రమానికి ఫోన్ ద్వారా వినతి సమర్పిస్తూ అమ్మవారి గుడి వద్ద విద్యుత్తు వైర్లు చెట్టుకు తాకుతున్నాయని, తగు చర్యలు చేపట్టాలని కోరారు.

**మొదటి పేజీ తరువాయి**

## ఏపీ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు

మంత్రి పదవులు దక్కే అవకాశముంది.

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులు ఖరారు

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవులకు అభ్యర్థులను వైకాపా ఖరారు చేసింది. ఇద్దరికి ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వాలని ఏపీ సీఎం జగన్ నిర్ణయించుకున్నారు. దీంతో రాయచోటికి చెందిన మైనార్టీ మహిళా నేత మైనా జకియాఖానుం, పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్సీ వర్గానికి చెందిన మోసేను రాజుకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు ఇరువురినీ నామినేట్ చేయాలని గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్‌ను ప్రభుత్వం కోరింది.

## అరబ్ ఆశల్ని మోసుకెళ్లిన 'హోప్'

ఆరు సంవత్సరాల వ్యవధిలోనే ఈ హోప్ మిషన్‌ను పూర్తిచేశారు. ఈ ప్రాజెక్టులో అధికభాగం కొలరాడో యూనివర్సిటీలోని 'ది ల్యాబరేటరీ ఫర్ అట్మాస్ఫియరిక్ అండ్ స్పేస్ ఫిజిక్స్' (ఎల్ఏఎస్పీ)లో పూర్తి చేసినప్పటికీ.. దుబాయ్ లోని 'మొహమ్మద్ బిన్ రషీద్ స్పేస్ సెంటర్' (ఎంబీఆర్ఎస్సీ)లో ముఖ్యమైన భాగం తయారైందని శాస్త్రవేత్తలు తెలిపారు. నాసా 'అడ్వైజరీ కమిటీ మార్స్ ఎక్స్‌ప్లొరేషన్ ప్రోగ్రాం అనాలిసిస్ గ్రూప్'(ఎంఈపీఏజీ) వీరికి తోడ్పాటు నందించింది. హోప్ ప్రయోగం అరబ్ దేశాల్లో యువతకు స్ఫూర్తినిస్తుందని, విద్యార్థులను శాస్త్రీయ పరిశోధనవైపు ఆకర్షించడానికి ప్రేరణ కలిగిస్తుందని ఆశిస్తున్నారు.

## 'వైజాగ్ ప్రజలను భయపెట్టాలనుకుంటున్నారా'

లేదు. అన్నీ ఒకే చోట ఉండాలని ఎక్కడా లేదు'అని ఆయన పేర్కొన్నారు.

**ఎన్ని కుట్రలు పన్నినా అభివృద్ధి ఆగదు**

అభివృద్ధి వికేంద్రీకరణ, సీఆర్డీఏ రద్దు బిల్లులపై అసెంబ్లీలో చర్చ కూడా జరిగిందని సజ్జల గుర్తు చేశారు. అసెంబ్లీలో రెండోసారి బిల్లుకు ఆమోదం లభించిందని అన్నారు. మండలిలో టీడీపీ సభ్యులు దౌర్జన్యం చేసి బిల్లులను అడ్డుకున్నారని సజ్జల మండిపడ్డారు. సెలక్ట్ కమిటీ పేరుతో టీడీపీ సభ్యులు కాలయాపన చేయాలని చూశారని విమర్శించారు. సెలక్ట్ కమిటీ అనేది వాస్తవరూపం దాల్చలేదని అన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణకు రాష్ట్ర ప్రజలంతా మద్దతు తెలిపారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందడం చంద్రబాబుకు ఇష్టం లేదని విమర్శించారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం సీఎం జగన్ ముందడుగు వేశారని సజ్జల పేర్కొన్నారు. బాబు ఎన్ని కుట్రలు పన్నినా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు.

## గవర్నర్‌ను కలిసిన నిమ్మగడ్డ రమేశ్

ఎన్నికల కమిషనర్‌ను నియమించే అధికారం గవర్నర్‌కు ఉందని ఉన్నత న్యాయస్థానం గతంలోనే స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన మేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం 2020 మార్చి 7న షెడ్యూల్ ప్రకటించింది. ఒకపక్క ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండగానే మరోపక్క దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య పెరగడం మొదలైంది. షెడ్యూల్ ప్రకారం పోలింగ్ నిర్వహిస్తే కరోనా వ్యాప్తి పెరిగే ప్రమాదం ఉందని, అందుకే ఎన్నికల ప్రక్రియను ఆరు వారాలు వాయిదా వేస్తున్నామని మార్చి 15న రమేశ్ కుమార్ ప్రకటించారు. ఆయన ప్రతిపక్షనేత చంద్రబాబు సామాజికవర్గానికి చెందినవారని, ఆ పార్టీకి మేలు చేసేందుకే ఎన్నికలు వాయిదా వేశారని ముఖ్యమంత్రి జగన్‌తోపాటు మంత్రులు, వైకాపా నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో తనకు రాష్ట్రంలో భద్రత లేదని, కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని మార్చి 18న ఎన్నికల కమిషనర్ కేంద్ర హోం శాఖకు లేఖ రాశారు. అప్పటి నుంచి ఆయన కొంతకాలం హైదరాబాద్ నుంచే విధులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా ఎస్ఈసీ పదవీ కాలాన్ని కుదిస్తూ రమేశ్ కుమార్‌కు చెక్ పెట్టింది. దీనిపై నిమ్మగడ్డ హైకోర్టును ఆశ్రయించారు. పలుమార్లు విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం నిమ్మగడ్డకు అనుకూలంగా తీర్పునిచ్చింది. కానీ, హైకోర్టు తీర్పుపై ఏపీ ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించింది. దీనిపై మూడు సార్లు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వలేదు. దీంతో కోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై ఏపీ ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై గవర్నర్‌కు కలిసి వినతి పత్రం సమర్పించాల్సిందిగా నిమ్మగడ్డను ఆదేశించింది.

## కోవిడ్ ఆస్పత్రుల్లో నాణ్యమైన సేవలపై ప్రత్యేక దృష్టి

నిర్వహించాలన్నారు. కోవిడ్ ఎవరికైనా వస్తుంది, ఆందోళన వద్దు. 85 శాతం మందికి ఇళ్లల్లోనే ఉంటూ నయం అవుతుంది. జాగ్రత్తలు పాటిస్తూ సకాలంలో వైద్యం తీసుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవాళ్లు, వయసులో పెద్దవాళ్లు వైద్య సహాయంలో ఆలస్యం వద్దు. క్షేత్రస్థాయిలో ఈ సమాచారాన్ని తెలియజేస్తూ హోర్డింగ్స్ పెట్టాలి. గ్రామ సచివాలయాల్లో కూడా ఈ హోర్డింగ్స్ ఉండాలి. క్వారంటైన్ సెంటర్ల సంఖ్య కన్నా క్వాలిటీ మీద దృష్టి పెట్టాలి. కోవిడ్ ఉందా లేదా అన్నది తెలుసుకోవడానికి ర్యాపిడ్ టెస్టులు అందుబాటులోకి వచ్చినందున ఎవరిని ఎక్కడ పెట్టాలన్న దానిపై స్పష్టత వస్తుందని, ఆ తర్వాత వారికి మంచి సేవలు అందించాలని సూచించారు.

అలాగే కాల్ సెంటర్ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, వినతుల మీద ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. టెలి మెడిసిన్‌పై ఎప్పటికప్పుడు రివ్యూ చేయాలి. మందులు ఇంటికి సరఫరా చేస్తున్నారా? లేదా? మరోసారి పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య రంగంలో చేపట్టనున్న నాడు-నేడు కార్యక్రమాలపై ఫోకస్ పెంచాలన్నారు. వచ్చే మూడు, నాలుగు నెలలపాటు నిర్దేశించుకున్న కార్యాచరణను పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఇవన్నీ పూర్తయితేనే కోవిడ్‌లాంటి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోగలమని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

## తితిదే మాజీ ప్రధాన అర్చకుని కన్నుమూత

ఆలయ ప్రధాన అర్చకుడిగా దాదాపు 20 ఏళ్లు సేవలు చేశారు. శ్రీనివాసమూర్తి దీక్షితులకు ఆలయం సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సి ఉంది. కానీ, కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు కూడా అప్పగించే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

## 12 దేశాల్లో ఒక్క కరోనా కేసు లేదు..

మహాసముద్ర ద్వీపదేశాలే ఉన్నాయి.

వివరాలు:

ఉత్తరకొరియా, పలావు, సమోవా, వనాటు, టువాలు, మార్షల్ దీవులు, పలావు, నౌరు, కిరిబాటి, మైక్రోనేషియా, సోలమన్ దీవులు, టోంగా దేశాలలో ఒక్క కరోనా వైరస్ కేసు కూడా నమోదు కాకపోవడం విశేషం.

# 'బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు.. బ్యాక్‌బోన్ క్యాస్ట్'



తాడేపల్లి: బీసీల అభ్యునతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని బీసీ సంక్షేమశాఖ మంత్రి శంకరనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం మీడియాతో మాటాడుతూ.. గత ప్రభుత్వంలో బీసీలకు జరిగిన అన్యాయం, వారి కష్టాలు తెలుసు కునేందుకు సీఎం జగన్ అధ్యయన కమిటీ వేశారు. బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ వర్కుల్లో, మహిళల పదవుల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించారు. స్వాతంత్రం వచ్చిన దగ్గర నుంచి ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ ప్రభుత్వం బీసీలకు పెద్ద పీఠ వేసింది. క్యాబినెట్‌లో కూడా బీసీలకు పెద్ద పీఠ వేశారు. బీసీల కోసం 28 కొత్త కార్పొరేషన్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బీసీలకు నేడు పండుగ రోజు. అందులో భాగంగా 30వేల జనాభా మించిన కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మెన్ , డైరెక్టర్లను నియమిస్తారు. గత ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంది. అందుకే బీసీలు గత ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెప్పారు. బీసీలంతా వైఎస్ జగన్ వెంట ఉన్నారు. ఆయనకు బీసీలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని శంకర నారాయణ తెలిపారు.

**బలహీన వర్గాల ప్రజలకు జగన్‌మోహన్ రెడ్డే బలం**

చంద్రబాబు బీసీలను వాడుకున్నారు తప్ప బీసీల బాగోగులు చూడలేదని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో బీసీల కష్టాలు చూశారు. 30వేల జనాభా దాటిన ప్రతి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని జగన్ హామీనిచ్చారు. సీఎం అయిన వెంటనే బీసీల సంక్షేమంపై దృష్టి పెట్టారు. మాటలు కాకుండా చెప్పిన ప్రతి హామీని సీఎం జగన్ నిలబెట్టుకుంటున్నారు. గడిచిన ఏడాది కాలంలో సంక్షేమానికి 43వేల కోట్లు ఖర్చు పెడితే అందులో రూ. 22వేల కోట్లు బీసీలకు ఖర్చు పెట్టిన ఘనత వైఎస్ జగన్‌ది. ప్రతి కులం రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని చెప్పే వ్యక్తి జగన్ అని జంగా కృష్ణమూర్తి అన్నారు. ఎమ్మెల్యే జోగి రమేష్ మాట్లాడుతూ.. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు.. బ్యాక్ బోన్ క్యాస్ట్ అని భావించిన వైఎస్ జగన్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే బీసీ,ఎస్టీ, ఎస్సీ, మైనారిటీల అభ్యున్నతికి అనేక చట్టాలు చేసింది. బలహీన వర్గాల ప్రజలకు జగన్‌మోహన్ రెడ్డే బలమని అన్నారు.



**బీసీలంటే బిజినెస్ క్యాస్ట్‌గా టీడీపీ చూసింది - ధర్మాన**

2014 ఎన్నికల్లో బీసీలు టీడీపీకి సపోర్ట్ చేస్తే చంద్రబాబు బీసీలను అన్ని విధాలుగా మోసం చేసిందని మంత్రి ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. అయితే వైఎస్ జగన్ తన పాదయాత్రలో బీసీల బాధలు తెలుసుకొని కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మాటప్రకారం బీసీల కోసం 28 కార్పొరేషన్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ బీసీలను బ్యాక్‌వర్డ్ క్యాస్ట్‌గా కాకుండా బిజినెస్ క్యాస్ట్‌గా చూసింది. అందుకే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని ధర్మాన పేర్కొన్నారు.


# అమూల్‌తో అవగాహన ఒప్పందంపై సీఎం జగన్ సమీక్ష

తాడేపల్లి: అమూల్‌తో అవగాహన ఒప్పందం నేపథ్యంలో క్యాంపు కార్యాలయంలో అధికారులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్‌మెంట్ కోపరేటివ్ ఫెడరేషన్ (ఏపీడీడీసీఎఫ్) ఎండీ వాణీ మోహన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అవగాహన ఒప్పందంలోని అంశాలను సీఎంకు అధికారులు వివరించారు. రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి రంగంలో కీలకపాత్ర పోషించనుందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళా పాడి రైతులను ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకురావడంలో ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. మహిళల సాధికారతకు తోడ్పాటు నందిస్తుందని వెల్లడించారు. మొత్తంగా డెయిరీ కార్యకలాపాల్లో కీలక అడుగు ముందుకు పడనుందన్నారు.

పాడి రైతులకు మంచి ధర దక్కడమే కాకుండా వినియోగదారులకు కూడా సరసమైన ధరలకి, నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని సీఎం తెలిపారు. ప్రపంచపు అత్యుత్తమ టెక్నాలజీ, విస్తృతమైన మార్కెటింగ్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, రాష్ట్రంలో పాడిపరిశ్రమ రంగాన్ని గొప్పగా తీర్చిదిద్దుతుందని సీఎం వైఎస్ జగన్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కాగా.. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకం కింద మహిళలకు ఏడాదికి దాదాపు రూ.11వేల కోట్లు ఖర్చుపెడుతున్నాం. మహిళలు మరింత స్వయం సమృద్ధి సాధించే దిశగా పాడిపరిశ్రమలో అవకాశాలను అందిపుచ్చుకునేలా వారిని ప్రోత్సహించాలి. ఆ పరిశ్రమల్లో వారికున్న అవకాశాలను పరిశీలించి మహిళలను ముందుకు నడిపించాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు.


# ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర క్షమించదు

## -భారతంలో దుర్యోధనుడిలా చంద్రబాబు - డర్టీ డజన్ విమర్శలు అర్థరహితం
## - ఏపీ టెక్నాలజీ కమిషన్ మాజీ ఛైర్మన్ కొయ్య ప్రసాద్‌రెడ్డి



విశాఖపట్నం: ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర క్షమించదని, చరిత్ర హీనులుగా మిగిలిపోతారని ఎపి టెక్నాలజీ కమిషన్ మాజీ చైర్మన్ కొయ్య ప్రసాద్రెడ్డి ప్రతిపక్ష నాయకుల తీరుపై విమర్శించారు. విశాఖ నగర పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాభారతంలో దుర్యోధనుడిలా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మయసభ ను చూసి అహం దెబ్బతిన్న దుర్యోధనుడు కురుక్షేత్ర యుద్ధంలో భూస్థాపితం అయ్యాడని అన్నారు. అలాగే రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వ లేక చంద్రబాబు నాయుడు దుర్యోధనుడిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని డర్టీ డజన్ గ్యాంగ్ అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తే ప్రతిపక్ష అడ్డుకుంటోందని అన్నారు. యనమల రామకృష్ణుడు శకుని లాంటి వాడిని, మాజీ మేయర్ సబ్బంహరి ఒక ఆకు రౌడీ అని, ఇలాంటి 12 మంది డర్టీ డజన్ నాయకులు ఎల్లో మీడియాలో గంటల తరబడి విశాఖ ఇమేజ్ దెబ్బతినేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. దేశంలోనే అత్యధికంగా కొవిడ్ పరీక్షలు నిర్వహించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మన్ననలు అందుకుంటుందని, కరోనా సమయంలో కూడా రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ ఆగలేదని అన్నారు. కరోనా వలన దేశం అంతా అభివృద్ధి ఆగినా రాష్ట్రంలో మాత్రం అభివృద్ధి పనులు ఆగలేదని అన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని గాలికొదిలేశారని, రాజకీయాలు తప్ప ఇంకేమీ పట్టడం లేదని, ఇలాంటి దౌర్భాగ్యమైన ప్రతిపక్షాన్ని ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. విశాఖపట్నాన్ని పరిపాలన రాజధానిగా చేస్తే పెట్టుబడులు పెద్దఎత్తున వస్తాయని తెలిపారు. కానీ ప్రతిపక్షాలు ఉత్తరాంధ్ర అభివృద్ధి అడ్డుకునేలా వ్యవహరిస్తున్నాయని, ఇక్కడ అభివృద్ధి నీ అడ్డుకుంటే చరిత్ర క్షమించదని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన 90% హామీలను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసిందని, ఇంతటి సంక్షేమ ప్రభుత్వం దేశంలోనే లేదని పేర్కొన్నారు.

## దిశ చట్టానికి దిక్కులేకుండా చేశారు : చంద్రబాబు



అమరావతి: దిశ చట్టం చేసేశామని కోట్ల ప్రజాధనంతో ప్రభుత్వం ప్రచారం చేసుకుంది.. కానీ అమలులో చట్టానికి దిక్కు లేకుండా చేశారని వైకాపా ప్రభుత్వంపై తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు విమర్శలు గుప్పించారు. తూర్పుగోదావరి జిల్లాలో ఓ బాలికపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటనపై చంద్రబాబు స్పందించారు. పోలీసులనే సవాల్ చేశారంటే నేరగాళ్లు ఎంత పేట్రేగిపోతున్నారో చూడండన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలన్న చిత్తశుద్ధి, నిబద్ధత ప్రభుత్వానికి లేదని చంద్రబాబు దుయ్యబట్టారు. పాలకుల స్వప్రయోజనాల కోసం వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తే దుష్ఫలితాలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికైనా నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

## నేటి నుంచి తిరుపతిలో సంపూర్ణ ఆంక్షలు



తిరుపతి: కరోనా కేసులు అధికమవుతున్న నేపథ్యంలో తిరుపతిలో రేపటినుంచి సంపూర్ణ ఆంక్షలు విధిస్తున్నట్లు కలెక్టర్ నారాయణ భరత్ గుప్తా సోమవారం ప్రకటించారు. అత్యవసర సేవలు, మెడికల్ షాపులు మినహా మిగతా దుకాణాలకు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ఈ సమయం దాటాకా వాహనాలకు కూడా అనుమతి ఉండదని పేర్కొన్నారు. ఈ ఆంక్షలు వచ్చే నెల 5 వరకు కొనసాగుతాయని తెలిపారు. జిల్లాలో కరోనా వైరస్ తీవ్రత అధికమవుతున్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా కరోనా కేసులు అధికమవుతున్నాయి. ఇప్పటివరకు చిత్తూరులో 5400 కరోనా కేసులు నమోదుకాగా, వీటిలో అత్యధికంగా తిరుపతిలోనే 1700 కేసులు నమోదయ్యాయి.

దీంతో ఆంక్షలను కఠినతరం చేస్తూ జిల్లా కలెక్టర్ నారాయణ భరత్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతీ ఒక్కరూ విధిగా నిబంధనలను పాటించి సహకరించాలని ఎస్పీ రమేష్ రెడ్డి కోరారు. పోలీసు శాఖలోనూ కరోనా కేసులు పెరుగుతున్నాయని, ఇప్పటికే ఇద్దరు పోలీసులు కరోనా కారణంగా మరణించారని పేర్కొన్నారు.

## విశాఖ ఇమేజిని దెబ్బతీయటానికి చంద్రబాబుతో కలిసి కుట్ర

### ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

విశాఖపట్నం: సోమవారం పేపర్‌లో వచ్చిన 'తీరంలో చీలిక' వార్తపై ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. దీనిలో ఆయన 'ఉత్తరాంధ్రకు సెక్రెటేరియట్ వస్తుందంటే, చంద్రబాబు నాయుడుతోపాటు రామోజీరావుగారికి కూడా నిద్ర పట్టటం లేదని ఈ రోజు వచ్చిన వార్తను చూస్తే అర్థమవుతోంది. ఈ వార్తను తెలుగుదేశం నేతలు తమ పలుకుబడి ఉపయోగించి మరో రెండు ఆంగ్లపత్రికల్లో కూడా ప్రచురింపజేశారు. ఇంతకీ ఈ వార్తలో ఏముందంటే... ఎప్పుడో 1 కోటీ 60 లక్షల సంవత్సరాల క్రితం తూర్పు గోదావరి నుంచి శ్రీకాకుళం వరకు 300 కిలోమీటర్ల మేర సముద్రంలో చీలిక ఏర్పడిందట. దాన్ని చూపించటానికి... ఓ పటం వేసి విశాఖపట్టణం అని రాశారు. 68 లక్షల సంవత్సరాల పూర్వం నుంచి 30 లక్షల సంవత్సరాల పూర్వం వరకు ఆ చీలికలో అలజడి ఉండేదట. ఇంతవరకూ మాత్రమే రాస్తే అది ఈనాడు ఎందుకవుతుంది' అంటూ ఎద్దేవా చేశారు.

'అందుకే ఆ సముద్ర గర్భంలో చీలిక వల్ల భవిష్యత్తులో ఉత్తరాంధ్రలో ఎప్పుడైనా భూ కంపాలు రావచ్చునని ఎవరో ఓ ప్రొఫెసర్‌ను పట్టుకుని చెప్పించారు. పనిలోపనిగా, అమరావతి ఒక్కచోటే రాజధాని ఉండాలని కూడా ఆ శాస్త్రవేత్తలతోనే చెప్పించి ఉంటే మరింత బాగుండేది. మొట్టమొదటగా మీరు పెట్టిన ఈనాడు విశాఖలోనే. మీ డాల్ఫిన్ హోటల్ విశాఖలోనే. మీ ఆస్తులు విశాఖలోనే. విశాఖకు ముప్పుందంటున్న మీరు మీ ఆస్తులన్నింటినీ ఖాళీ చేయించి మీ ఉద్యోగుల్ని ఇక్కడ నుంచి తక్షణం బయటకు తీసుకువెళ్ళిపోతారా. అసలు విశాఖకు ముప్పుందా.. ఎవరిది చెప్పింది' అని ప్రశ్నించారు. అంతేకాక 'మనకు ఆధారాలతో తెలిసిన మానవ చరిత్ర సింధు నాగరికత నుంచే కదా. అంటే కేవలం 6 వేల సంవత్సరాల నుంచే కదా. మరి 30 లక్షల సంవత్సరాల క్రితమే ఆగిపోయిన అలజడి... ఇప్పుడు చంద్రబాబు నాయుడు దిగిపోవటం వల్ల మళ్ళీ మీలో రేగిందా.. లేక... అమరావతిలో చంద్రబాబు కొనుగోలు చేసిన భూములమీద



మీకు కూడా ప్రేమానురాగాలు పెరిగాయా' అని ప్రశ్నించారు. అంతేకాక 'విజయవాడలోనే సెక్రెటేరియట్, హైకోర్టు ఉంటే... హైదరాబాద్‌లో రామోజీ ఫిలింసిటీకి డిమాండ్ పడిపోకుండా ఉండాలన్నది మీ ఆలోచనలా ఉంది. విశాఖపట్టణం అభద్రం... మొత్తంగా తూర్పు గోదావరి నుంచి శ్రీకాకుళం వరకు అంతా అభద్రం అనే వార్త రాసే ముందు అందులో నిజానిజాలతో సంబంధం లేకుండా ఎలా అచ్చువేస్తారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలను భయపెట్టాలని ఎందుకు చూస్తున్నారు. మీ చంద్రబాబు ప్రయోజనాలు, మీ తెలుగుదేశం ప్రయోజనాలు తప్ప మీకు ప్రజా ప్రయోజనాలు పట్టవా. ఈస్టర్న్ నేవెల్ కమాండ్ ఎక్కడ ఉంది.. విశాఖలోనే కదా. సబ్‌మెరైన్ బేస్ భారతదేశానికి ఎక్కడ ఉంది.. విశాఖలోనే కదా. అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలకు కేంద్రం విశాఖ. ఇది రాష్ట్రంలోనే అతి పెద్ద నగరం. విశాఖ ఇమేజిని, ఉత్తరాంధ్ర ప్రాభవాన్ని దెబ్బతీయటానికి చంద్రబాబుతో కలిసి ఇంతకు దిగజారతారా. దీన్ని జర్నలిజం అంటారా' అంటూ వరుస ధర్మ శ్రీ వరుస ప్రశ్నలు కురిపించారు.

## టారెత్తిస్తున్న టమోట

విశాఖపట్నం : ప్రతీ వంట కానికి అవసరమైన టమోట ధరలు ఆకాశాన్ని తాకు తున్నాయి. డిమాండ్.. సర ఫరాల మధ్య అంతరం రోజు రోజుకు పెరుగుతుండ టంతో.. ధరల్లోనూ ఆ ప్రభావం కని పిస్తోంది. రైతు బజార్లలో కిలో రూ.50, బహిరంగ మార్కెట్లో రూ. 65కు పైగానే ధర పలుకుతోంది. అధి కారులు దృష్టిసారిస్తే కొంత వరకు ధరలు అదుపులోకి రావచ్చు

## శ్రీరామ్‌కి సముచిత స్థానం



అనకాపల్లి : సమాజన సేవకుడు కాండ్రేగుల శ్రీరామ్ వినాయక నిమజ్జనోత్సవక మిటీ వైస్ చైర్మన్‌గా నియమితు లయ్యారు. 14 ఏళ్లుగా అనకా పల్లిలో నిమజ్జనోత్సవ కమిటీ పనిచేస్తుంది. ఇటీవల ఈ కమిటీకి నూతన కార్యవర్గం ఎంపికైంది. అందులో సమాజ సేవకుడు కాండ్రేగుల శ్రీరామ్‌కు వైస్ చైర్మన్ పదవిని ఇచ్చి సముచిత స్థానం కల్పించారు. ఈసందర్భంగా ఈయన మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా చేస్తున్న కార్యక్రమాలను గుర్తించి ఈ కమిటీలో నాకు స్థానం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వ్యవస్థాపకులు కుమారస్వామి గత వైస్ చైర్మన్ మందపాటి జానకిరామరాజు మళ్ల సురేంద్ర తమను ప్రోత్సహిస్తున్న కెఎం నాయుడు తదితరులకు ఈసందర్భంగా శ్రీరామ్ కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతకలు సమర్ధవంగా నిర్వహిస్తానని నాపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ముచేయనని ప్రకటించారు.

## కంటోన్మెంట్ జోన్ లో కోవిడ్ పరీక్షలు నిర్వహించాలి

### టీడీపీ అర్బన్ జిల్లా కార్యదర్శి జోగినాయుడు



అనకాపల్లి : పట్టణంలో కంటోన్మెంట్ జోన్ పరిధిలో కరోనా పరీక్షలు నిర్వహించాలని తెలుగుదేశంపార్టీ విశాఖ అర్బన్ కార్యదర్శి బిఎస్ఎంకే జోగినాయుడు, డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకనట విడుదల చేస్తూ అనకాపల్లిలో రోజు రోజుకు కరోనా విజృభిస్తుందని, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఎంత జాగ్రత్తగా ఉన్నా ఎదో కాంటాక్ట్ ద్వారా వైరస్ సోకుందన్నారు. వెంటనే అదికారులు కేసులు నమోదు అయిన ప్రాంతంలో శానిటేషన్, బ్లీచింగ్, చేయాలని, కోరారు. ప్రజలు భయాలను తొలగించాలన్నారు. ప్రజలు పరీక్షలు చేయించు కుందా మన్నా క్యాంపులు అందు బాటులో లేవన్నారు. అధి కారులు ముందు కంటో న్మెంట్ జోన్‌లో టెస్టులు నిర్వహిం చాలని అందుకు తగిన చర్యలు తీసు కోవాలని జోగినాయుడు కోరారు.

## గురువారం నుండి పీఎంపాలెం లో స్వచ్ఛంద లాక్‌డౌన్

మధురవాడ, కరోనా మహమ్మారి విజృంభణతో పీఎం పాలెం ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు వర్తకుల సంఘం సంయుక్తంగా పీఎం పాలెం పరిసర ప్రాంత కాలనీలు లో స్వచ్ఛంద లాక్ డౌన్ కు పిలుపునిచ్చారు. ఈ నెల గురువారం 23 నుండి స్వచ్ఛందంగా వ్యాపార సంస్థలు లాక్ డౌన్ చేస్తున్నట్లు ప్రకటించారు నిత్యావసర వస్తువులు, కాయగూరలు వంటివి కొనుక్కోవడానికి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తెరిచి ఉంచబడుతుంది అని స్థానిక ప్రజలు అందరూ పై విషయాన్ని గమనించి సహకరించగలరని కోరుతున్నామన్నారు. అలాగే వ్యాపారా ప్రదేశాలలో ప్రజలందరూ విధిగా మాస్కు ధరించి, భౌతిక దూరం పాటించాల్సిందిగా అత్యవసర పరిస్థితిలో తప్ప ప్రజలు ఎవరు మధ్యాహ్నం తరువాత బయటకు రావద్దని కోరుతున్నారు. ఇట్లు స్థానిక పెద్దలు మరియు వాణిజ్య సంఘం నాయకులు.

## అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలి : సిపిఎం



ములగాడ: సిపిఎం పార్టీ మల్కాపురంజోన్ కమిటీ అధ్వర్యంలో సోమవారం అచ్చింనాయుడు లోవ, ములగాడలో తెదేపా ప్రభుత్వం హయాంలో కట్టిన ఇళ్ళ నిర్మాణాలను సిపియం బృందం పర్యటించి పరిశీలించింది. ఈ సందర్భంగా సిపియంపార్టీ మల్కాపురంజోన్ కార్యదర్శి ఆర్ .లక్ష్మణమూర్తి మాట్లాడుతూ పేదల ఇళ్ళకోసం తెదేపా ప్రభుత్వం 500రూపాయలునుండి లక్ష రూపాయులు వరకు డబ్బులు కట్టించుకోని పట్టాలుచేతికిచ్చారని, ఇంతలో ప్రభుత్వం మారిపోయి జగన్ పాలన వచ్చి సంవత్సరం గడుస్తున్నా పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం డబ్బులు కట్టిన పేదలకు కడుతున్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిగా నిర్మించి ఇక్కడే ఇళ్ళు ఇవ్వాలని ప్రభుత్వాన్ని సిపిఎంపార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఇళ్ళు కోసం డబ్బులు కట్టినవారు అద్దె ఇంటిలో ఉన్నవారు 21వ తేది మంగళవారం వార్డు సచివాలయాలువద్ద ఇళ్ళుకోసం జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలంతా పాల్గోనాలని సిపిఎంపార్టీ తరుపున విజ్ఞప్తి చేసారు. ఈ పర్యటనలో సిపిఎం జోన్ నాయుకులు కె.పెంటారావు, పూడి పైడిరాజు, టి.అప్పారావు, కాటం రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ మంత్రి సత్యారావు నిర్వాసితులకు చేసిన సేవలు మరువలేనివి



గాజువాక : ఉక్కు నిర్వాసితుల నాయకు స్వర్గీయ మంత్రి సత్యారావు 9వ వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 76వార్డులోని స్వర్గీయ మంత్రి సత్యారావు స్వగృహంలో వార్డ్ వైఎస్సార్సీపీ కార్పొరేటర్ అభ్యర్థి మంత్రి శంకర నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా ఇంటక్ నాయకులు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్వర్గీయ మంత్రి సత్యారావు నిర్వాసితులకు చేసిన సేవలు కొనియాడారు. నడుపూరు ప్రెసిడెంట్ గా, స్టీల్ ప్లాంట్ ఆర్- కార్డులు ఈప్పించటం, కాంట్రాక్టు కార్మికులుగా ఉద్యోగములు ఇప్పించుటలో ఆయన చేసిన సేవలను మరువలేమన్నారు. నిర్వాసితుల నాయకులు, గొందేశి సత్యారావు,పులి రమణారెడ్డి, బి.కృష్ణారావు, దొమ్మేటీ అప్పారావు, బెళ్ళల సత్యనందము,పెరుమ్మలు, గోపీ, మంత్రి శ్రీను, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## పురాతత్వాన్ని తవ్వితీద్దాం

భారతీయత అంటే భిన్న సంస్కృతుల, తాత్విక ధారల సమ్మేళనం, సహజీవనం అనేది మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రబోధం. 'మహాయాన సంప్రదాయాలలో విగ్రహారాధన, అవతారతత్వం, పునర్జన్మవాదం లాంటి హిందూ మత భావాలు చోటుచేసుకున్నవి. ఆదిశంకరుల గురువైన గౌడపాదాచార్యులు బౌద్ధ సంప్రదాయంచే ప్రభావితులైనట్లుగా చెప్పబడుట సువిదితాంశమే. ఆయన బుద్ధుడిని హైందవావతారంగా గుర్తించి ప్రస్తుతించారు... బౌద్ధ, జైన, హిందూ సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు చిరకాల సహజీవనం జరిపి ఎన్నెన్నో ఆదానప్రదానాలకు లోనైనవి.. ఆదిశంకరుల అనంతరకాలంలో బౌద్ధ జైనమతాలు రక్తపాత రహితంగా హిందూమత సంప్రదాయాలతో సమరసమైపోవడం కూడా ఒక అద్భుతావహ అనుభవము. అలాగే ఇస్లాం, క్రీస్తు, పారశీక మతాలు భారతీయతను సంతరించుకున్నవి... భాషా, ప్రాంత, మతమూలకమైన భావ వైవిధ్యాన్ని సమన్వయపరచి జాతీయ సమైక్యతలో వినియోగపడే దిశలో వాటిని మలుచుకునే ప్రక్రియ ఈ దేశానికి అనాది నుండి అలవడిందే' అని పీవీ వివరించారు.

'అనేక చారిత్రకాంశాలపై భిన్నాభిప్రాయాలున్నాయి. ఆర్యులు మధ్య ఆసియా నుంచి భారతదేశానికి వలస వచ్చారనియు భారతీయ ఆదివాసులైన ద్రావిడులపై ఆధిపత్యం వహించారనియు కొందరు చరిత్రకారులు భావిస్తున్నారు. మరికొందరు అలా కాక ఆర్యవైదిక సంస్కృతి ఆది నుంచి భారతదేశానికి చెందియున్నదేనని అభిప్రాయపడుతున్నారు... సింధులోయకు చెందే హరప్పా మొహంజదారో సంస్కృతి ద్రావిడులకు చెందినదా, ఆర్యులదా అంటూ వాదవివాదాలిప్పటికీ కొనసాగుతున్నవి' అని వివరిస్తూ- భారతీయ ప్రాచీనాంశాలపై విస్తృత పరిశోధనలు జరగాలని పీవీ సూచించారు.

మానస సరోవర యాత్ర తొలి బృందంలో పీవీ నరసింహారావు సోదరుడు మనోహర్‌రావు కూడా ఉన్నారు. ఈ పర్యటన అనంతరం ఆయన రాసిన కైలాస దర్శనం' పుస్తకానికి పీవీ రాసిన ముందు మాట.. కైలాస మానస సరోవర యాత్రను గురించిన ఈ గ్రంథంలో భారతీయ ప్రాచీన సంస్కృతికి చెందిన కొన్ని ముఖ్యాంశాల వివరణకు పూనుకొనడం జరిగింది. హిమాలయ మేరు పర్వతాలు, గంగా, యమునా, సింధూ నదులు, హిందూ దేవీ దేవతా గాథలకు చెందే పలు ప్రదేశాలు, అనేక ఋషుల ఆశ్రమ కేంద్రాలు, హిమాచల పరిసరాలలోని ఎన్నో పవిత్ర స్థలాలు పేర్కొనబడ్డాయి.

వైదిక సంస్కృతి, జైన, బౌద్ధ సంస్కృతి, పౌరాణిక సంస్కృతి అనే మూడు శాఖలు కూడా భారతదేశానికి చెందినవే. ఈ మూడు సంస్కృతులు కూడా విశ్వవ్యాప్తంగా ప్రభావం వేసినవి. మానవ నాగరికతా వ్యాప్తికి అసాధారణ పాత్ర వహించినవి. ఆర్యులు మధ్య ఆసియా నుంచి భారతదేశానికి వలస వచ్చారనియు భారతీయ ఆదివాసులైన ద్రావిడులపై ఆధిపత్యం వహించారనియు కొందరు చరిత్రకారులు భావిస్తున్నారు. మరికొందరు అలా కాక ఆర్యవైదిక సంస్కృతి ఆది నుంచి భారతదేశానికి చెందియున్నదేనని అభిప్రాయపడుతున్నారు. ఈ సుదీర్ఘ వివాదంపై ఇతోధిక పరిశోధన కావలసి వుంది.

గత రెండు శతాబ్దాలలో పాశ్చాత్య విద్వాంసుల ఆధిక్యత మన విజ్ఞాన విద్యారంగాలలో విరివిగా కొనసాగినది. ఆ ప్రభావం నేటికీ కొనసాగుతూనే ఉంది. విదేశీ పరిపాలనలో, సంస్కృతీ విజ్ఞానరంగాలలో కొన్ని నియంతృత్వ ధోరణులు అమలైనవి. దివ్య జ్ఞాన సమాజానికి చెందిన మేడం బ్లావైట్స్కీ, అనీ బిసెంటు, మిస్టర్ జడ్జిలాంటి వారు తమకు విశ్వాంతరాళాల నుంచి కుతుమి, మోర్యాయనే (బౌద్ధ) దివ్యాత్మల నుంచి దివ్య సందేశాలు వస్తుంటాయని చెపితే, నిజమే కాబోలుననుకొని విశ్వసించినవారు అనేకులున్నారు. తుదకు అదంతా బూటకమని కీ.శే.జిడ్డు కృష్ణమూర్తిగారు ఖండించిన విషయం సువిదితాంశమే. బ్రిటీషు హయాంలో ఇలాంటి ఉదంతాలు అనేకం జరిగినవి.

## నిమ్స్‌లో కొవిడ్ వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్స్




హైదరాబాద్ : కరోనా వైరస్‌తో ప్రపంచమంతా పోరాడుతోంది. ఈ మహమ్మారిని కట్టడి చేసేందుకు అన్ని దేశాలు కృషి చేస్తున్నాయి. ఇప్పటికే పలు చోట్ల క్లినికల్ ట్రయల్స్ ప్రారంభమయ్యాయి. తాజాగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో కొవిడ్ వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్స్‌ను వైద్యులు ప్రారంభించారు. ఇద్దరు వాలంటీర్లకు కొవాగ్జిన్ అనే వ్యాక్సిన్‌ను నిమ్స్ వైద్యులు ఇచ్చారు. స్వదేశీ కరోనా వ్యాక్సిన్ కొవాగ్జిన్‌ను భారత్ బయోటెక్ రూపొందించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ) సహకారంతో హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ 'కొవాగ్జిన్' పేరిట టీకాను అభివృద్ధి చేస్తున్నది. ఈ వ్యాక్సిన్‌పై మొదటి, రెండో క్లినికల్ ట్రయల్స్ జరిపేందుకు ఇండియన్ డ్రగ్ రెగ్యులేటరీ అనుమతులను మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 375 మంది వలంటీర్లపై మొదటి దశ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించినట్టు సంస్థ ప్రకటించింది.

## ఆర్థిక సాయానికి ప్రధాని మోడీ, సీఎం యోగిలకు జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్ వినతి



లక్నో : కరోనా మహమ్మారి కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుకుంటున్న తన కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం యోగి ఆదిత్యనాథ్లకు విజ్ఞప్తి చేస్తుంది ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్ రాథ ఠాకూర్. కుటుంబ ఆర్థిక సమస్యలను ఎదురుకునేందుకు తను సాధించిన మెడల్స్‌ను సైతం విక్రయించేందుకు సిద్ధపడింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'నేను ఏడుసార్లు జిల్లా ఛాంపియన్‌గా గెలుపొందాను. ప్రధాని మోడీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ ఎల్లప్పుడు మహిళా సాధికారత కోసం పిలుపునిస్తుంటారు. వారు నిజంగా మాకు సాయం చేస్తారని నేను నమ్ముతున్నాను. మా దుస్థితిని గమనించమని వారిని కోరుతున్నారు. నాకు మీ సాయం కావాలి' అని రాథ ఠాకూర్ వేడుకుంది. తన కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి మాట్లాడుతూ 'లాక్‌డౌన్ సమయంలో నా తండ్రి, సోదరుడు ఉద్యోగాలు కోల్పోయారు. దీంతో మా కుటుంబానికి ఆదాయం లేకుండా పోయింది. మాకు అప్పు ఇవ్వడానికి ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో చేసేదేమిలేక నేను గెలుపొందిన మెడల్స్‌ను అమ్మాలని నిర్ణయించుకున్నాను. దీంతో నాకు 1,000 నుంచి 2,000 రూపాయలు వస్తాయి. వాటితో నా కుటుంబానికి రెండు రోజులకు సరిపడా భోజనం మాత్రమే లభిస్తుంది'' అని చెప్పింది. బ్యాడ్మింటన్ ఆడుతున్నప్పుడు తాను ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నానని తెలిపాంది. 'ప్రతి టోర్నమెంట్‌కు నాకు 5000 నుంచి 6000 రూపాయలు ఖర్చు అయ్యేవి. నా కుటుంబ సభ్యులు ఏదో ఒక విధంగా ఆ డబ్బును సమకూర్చేవారు. నా తండ్రి ఒక కార్మికుడు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ వారు నన్ను ప్రోత్సహించేవారు' అని చెప్పింది. ఉత్తరప్రదేశ్ తరపున మూడుసార్లు ఆడానని రాథ ఠాకూర్ తెలిపింది. ఇప్పుడు కూడా ఆడాల్సి ఉండగా కరోనా కారణంగా టోర్నమెంట్ వాయిదా పడింది చెప్పింది. మా కుటుంబం చాలా సమస్యలను ఎదుర్కొంది, కానీ మేము నా కుమార్తె కలలకు మద్దతు నిలిచామని చెప్పింది రాథ తల్లి బినేష్ దేవి. 'మేము రాథ ఎదుగుదలకు మా వంతుగా సాయం చేశాం. నువ్వు వెళ్లి ఆడుకో.. మిగతావన్నీ మేము చూసుకుంటాం' అని చెప్పేవాళ్లమని ఆమె వివరించింది.

## ప్రతి జిల్లాలో మానవ అక్రమ నిరోధక యూనిట్స్ ఏర్పాటు చేయాలి

విశాఖపట్నం : రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా నిరోధం కోసం ప్రతి జిల్లాలో మానవ అక్రమ నిరోధక యూనిట్స్ ఏర్పాటు చేయాలని అలాగే ప్రతి జిల్లా కేంద్రాలలో ఉన్న దిశమహిళ పోలీస్ స్టేషన్ లకు అనుబంధంగా ఈ పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలని ధరణి సంస్థ కార్యదర్శి బి. హరి వెంకట రమణ, ఉత్తరాంధ్ర విముక్తి కలెక్టివ్ సంయుక్తంగా ఒక వినతి పత్రం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని, కోరడం జరిగింది .కోవిడ్ - 19 రుగ్మత వల్ల అనేకమంది బడుగు, బలహీన వర్గాల ప్రజలు,వలస కూలీలు, వ్యభిచారంలో మగ్గుతున్న మహిళలు,అక్రమ రవాణా నుంచి విముక్తి కాబడిన బాధితులు ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే వారిని అన్ని విధాలుగా ఆదుకొంటు వారు తిరిగి అక్రమ రవాణాకు గురి కాకుండా నిరోధించేందుకు అన్ని జిల్లాలో మానవ అక్రమ నిరోధక యూనిట్స్ ఏర్పాటు చేసి వాటికి ''పోలీస్ స్టేషన్''హోదా కల్పించాలని కోరుతూ గత నెలలో ధరణి ''సంస్థ రాష్ట్ర ప్రభుత్వం కు, వినతి పత్రాలు అందించడం జరిగింది. జులై 6వతేదీన కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక జీవో నెం. 2401/2020-ఎటిసి,తేదీ 06/07/2020)విడుదల చేస్తూ దేశంలో కోవిడ్ వల్ల ఏర్పడుతున్న పరిస్థితులలో మానవ అక్రమ రవాణా పెరిగే అవకాశమున్నందున దేశంలో నూరు శాతం అన్ని జిల్లాల్లో మానవ అక్రమ నిరోధక యూనిట్స్ ఏర్పాటుచెయ్యాలని అందుకోసం ప్రత్యేక నిధులు కూడా విడుదల చేస్తున్నట్లుగా ప్రకటిం చటం జరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో 5 మానవ అక్రమ నిరోధక యూనిట్స్ లు మాత్రమే పని చేస్తున్నాయని కానీ వాటికి ''పోలీస్ స్టేషన్ ''హోదా లేనందున,అలాగే ప్రత్యేక సిబ్బంది లేకపోవటంతో అవి నామమాత్రంగానే ఉన్నాయి. ఇప్పుడు ప్రతి జిల్లాలో మరియు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో కూడా వీటిని ఏర్పాటు చేయాలని కోరారు.

## నాలుగోరోజూ లాభాల్లో.. 11వేల పైకి నిఫ్టీ

ముంబయి ః: దేశీయ మార్కెట్లు వరుసగా నాలుగోరోజూ లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఐటీ షేర్ల అండతో సూచీలు దూసుకెళ్లాయి. ఈ క్రమంలో నిఫ్టీ మళ్లీ 11 వేల మార్కు అందుకుంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 459 పాయింట్ల వరకు లాభపడింది. చివరికి 398.85 పాయింట్ల లాభంతో 37,418.99 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 120.50 పాయింట్లు లాభపడి 11,022 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 74.92గా ఉంది. నిఫ్టీలో బ్రిటానియా ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, బజాజ్ ఫిన్‌సర్వ్, యూపీఎల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా, సిప్లా, జీ ఎంటర్‌టైన్‌మెంట్, బీపీసీఎల్, ఎన్టీపీసీ షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి.

రంగాల వారీగా చూస్తే ఫార్మా మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. ఇటీవల క్యూ1 ఫలితాల్లో రాణించిన నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ఇవాళ్టి ట్రేడింగ్‌లో దూసుకెళ్లాయి. 4 శాతం మేర షేరు విలువ పెరిగింది.

## కవి సమయం

### 'అప్పులేనివాడే అపర కుబేరుడు

అప్పు అనేది ఈ రోజు అవసరంగా మారిపోయింది. ఎవరి అవసరాలకు తగ్గట్టుగా అంతా 'అప్పు' చేసి బతికేస్తున్నారు. కానీ అప్పుతో ముప్పు తప్పదు. అప్పు చేసి దానిని అనుకున్న సమయానికి తీర్చలేకపోతే అది మరింత భారమవుతుంది. వడ్డీ వ్యాపారుల అకృత్యాలు, ఆగడాలు ఈ మధ్యన బాగా వెలుగులోకి వచ్చాయి. అప్పు తప్పు కాదు. కానీ గొప్పలకు పోయి సంపాదించి తీర్చేయగలమన్న ధీమాతో అప్పు చేయకూడదు. వాయిదా పద్ధతులలో అవి కొనండి, ఇవి కొనండి అంటూ వ్యాపారసంస్థలు కూడా 'అప్పు'ను ప్రోత్సహిస్తున్నాయి. మన దేశానికీ చాలా అప్పు వుంది. ప్రతి భారత పౌరుడూ నేడు ఋణగ్రస్తుడే. 'అప్పు' చేసి సమయానికి గానీ మనం దానిని తీర్చలేకపోతే మనం మాటలు పడాల్సి వస్తుంది. దాంతో మనం నలుగురికీ చులకనయిపోతాం. అందువలన మనకు ఉన్న దాంతో అప్పు చేయకుండా బ్రతకడం మేలు. మనకున్న సంపాదనను దృష్టిలో వుంచుకుని ఖర్చులను నియంత్రించి కొంత పొదుపునూ అలవర్చుకోవాలి. అప్పుడు అప్పులు చేసే అవసరం రాదు. అప్పులేనివాడు అపర కుబేరుడంటూ ఒక శతకకవి ఇలా వ్రాశాడు.

'ఉప్పు లేని కూర హీనంబు రుచులకు
పప్పు లేని తిండి ఫలము లేదు
యప్పు లేనివాడె యధిక సంపన్నుండు
విశ్వదాభిరామ వినురవేమ'

... కవిత రచన
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

| మాసం : శ్రావణ : శు.పాడ్యమి రా.9.46; పుష్యమి రా.9.40; ఉ.వ.5.48ల 7.23. | మంగళవారం 21-07-2020 |
|---|---|

**మేషం** : మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులలు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం. **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **మిధునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెం టేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం ఆర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. **ధనుస్సు** : వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్య లెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

# సంపదలను ప్రసాదించే శివుడు

## సంకీర్తన



జీవితాన్ని ఆర్థిక పరిస్థితి ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అన్ని ఆనందాలు .. సంతోషాలు ఆర్థిక పరిస్థితితో ముడిపడిలేకపోయినా, అది చూపించే ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అవసరాలు .. ఆపదల బారినుంచి బయటపడటానికి ఆర్థిక పరిస్థితి బాగా ఉండవలసిందే. అలాంటి పరిస్థితుల్లో ఆయురారోగ్యాలతో పాటు ప్రతి ఒక్కరూ సంపదలను కూడా భగవంతుడిని కోరుతుంటారు.

ఇలా సంపదలను పొందాలనుకున్నవాళ్లు, పరమశివుడిని పూజించడం వలన ఫలితం ఉంటుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. సోమవారం పరమ శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు. ఈ రోజున స్వామివారిని మారేడు దళాలతోను .. శంఖు పుష్పాలతోను పూజించడం వలన, సంపదలు చేకూరుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. అందువలన ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి బయటపడాలనుకునేవాళ్లు, సదాశివుడిని ఈ రీతిగా పూజించి ఆయన అనుగ్రహాన్ని పొందవచ్చు.

### ఆపదలు తొలగించే అమ్మవారు

శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు ఏ రూపంలో వున్నా .. ఏ పేరుతో కొలవబడుతూ వున్నా అమ్మ ప్రేమతో అనుగ్రహిస్తూనే ఉంటుంది. అందువల్లనే అమ్మవారి ఆలయాలు ఎక్కడ వున్నా భక్తులతో నిత్యం సందడిగా కనిపిస్తూనే ఉంటాయి. అమ్మవారిని పూజించడం వలన సౌభాగ్యం నిలుస్తుందని .. సంపదలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

ఇక అమ్మవారు ఆవిర్భవించిన 'అష్టమి' తిథి రోజున ఆ తల్లిని పూజించడం మరింత మంచిదని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. అష్టమి రోజున అమ్మవారిని పూజించడం వలన .. పారాయణం చేయడం వలన .. ఆ రోజున 8 రకాల వంటకాలు నైవేద్యంగా సమర్పించడం వలన విశేషమైన ఫలితాలు కలుగుతాయి. ముఖ్యంగా అనారోగ్యాలు .. ఆపదలు దరిచేరవు. జీవితాన్ని అనారోగ్యాలు .. ఆపదలు అతలాకుతలం చేస్తుంటాయి. అందువలన అలాంటి గండాల బారిన పడకుండా అష్టమి రోజున అమ్మవారిని ఆరాధిస్తూ ఉండాలి.



# ఎంపీ,ఎమ్మెల్యే కార్యక్రమాలును విజయవంతం చేయండి

## వైసీపీ సిఇసి సభ్యులు పైల శ్రీనువాస్



పరవాడ : అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతి, పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అధీప్‌రాజ్ సోమవారం పరవాడ మండలం లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలుకు శ్రీకారం చూడతారుఅని వైసీపీ సిఇసి సభ్యులు పైల శ్రీనువాసురావు తెలిపారు.నేడు ఉదయం 9గంటలుకు పెదముషిడివాడ గ్రామంలో నూతనంగా నిర్మించే రైతు భరోసా కేంద్రం మరియు వెల్నెస్ కేంద్రం శంఖుస్థాపన 9.30 గంటలకు లంకలపాలెం రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి మంజూరుకు స్థలం పరిశీలించి తదుపరి 10 గంటలకు తానాం గ్రామంలో నూతన రైతుభరోసా కేంద్రం శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం భరిణికం గ్రామానికి వెళ్లి ప్రమాదకర లుకేమియా బ్లడ్ కాన్సర్ తో బాధ పడుతూ తమిళనాడు రాష్ట్రంలో వెల్లూరు సిఎంసి ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ సోదరుడు బోండా నాని కుమారుడు వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయాన్ని అందించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పి భరోసా కల్పిస్తారని తెలిపారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పైలశ్రీనువాసురావు కోరారు.

# 'డాక్టర్ సీదిరి' కి మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

## రాష్ట్ర జాలారి కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కదిరిరాము



విశాఖపట్నం : శ్రీకాకుళం జిల్లా, పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ సీదిరి అప్పలరాజు కి మంత్రివర్గ విస్తరణ లో చోటు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాలారి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు,సీనియర్ న్యాయవాది కదిరి రాము ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డాక్టర్ 'సీదిరి' మత్స్యకార సమస్యల పై అవగాహన కలిగిన అసలైన మత్స్యకారుడని, ప్రజాసమస్యలు తెలిసిన నిజమైన నాయకుడని, డాక్టర్ 'సీదిరి'లాంటి యువ నాయకత్వాన్ని, నవ తరాన్ని పార్టీఅధిష్టానం ప్రోత్సహించాలని కదిరి రాము పేర్కొన్నారు. జాలారి మత్స్యకార సామాజికవర్గానికి చెందిన డాక్టర్ 'సీదిరి'కి మంత్రిపదవి కేటాయించి, వెనుకబడిన తరగతి మత్స్యకారుల పట్లపార్టీ తమ చిత్తశుద్ధిని మరోసారి ప్రకటించాలని ఆయన కోరారు. మత్స్యకార అగ్నికుల క్షత్రియ, వాడ బలిజ, జాలారి, వన్నె రెడ్డి,పల్లె రెడ్డి,వన్నె కాపు, పల్లె కాపు, బెస్త, పల్లె, నెయ్యల, గూండ్ల, పట్టపు, గంగవర్, గంగపుత్ర పద్నా లుగు ఉపకులాల మత్స్యకార నాయ కులు, మత్స్యకారులు డాక్టర్ 'సీదిరి'కి మద్దతుగా నిల వాలని, అది మనందరి సామాజిక వర్గ బాధ్యత గా గుర్తెరగాలని పేర్కొన్నారు. కొత్తగా ప్రకటించబోయే మంత్రివర్గ విస్తరణలో డాక్టర్ సీదిరి అప్పలరాజు కి పార్టీ అధిష్టానం తప్పకుండా స్థానం కల్పిస్తుందన్న ఆశాభావాన్ని కదిరి రాము వ్యక్తం చేశారు.

## గజపతినగరంలో దాతల సహకారంతో


# పేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

చోడవరం : మండలంలోని గజపతి నగరం గ్రామంలో దాతల సహాయ సహకారాలతో స్థానిక పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ కని శెట్టి రామునాయుడు, మాజీ డిసిసిబి డైరెక్టర్ సరగడం జగ్గారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మత్స్య రాజు తదితరుల చేతుల మీదుగా 30 మంది పేదలకు పంచదార, గోధుమపిండి, మైదా, ఆయిల్ ప్యాకెట్లు, కోడిగుడ్లు, ఉల్లిపాయలు, సబ్బులు తదితర నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు శరగడం రామునాయుడు, కె నాగరాజు, సాయి కృష్ణ, పాలమారు శెట్టి సురేష్, శిలా పర శెట్టి నాయుడు, కె ఈశ్వరరావు, కే శేఖర్, దాసరి శ్రీనివాసరావు, దుసు వెంకటరమణ, బుద్ధ గంగరాజు, పెంటకోట సూరిబాబు, కే.సుబ్బారావు, మల్ల సతీష్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న గ్రామ పెద్దలు కె.రామునాయుడు, ఎస్ జగ్గరావు

# కనకదుర్గమ్మవారి ఆలయంలో ఘనంగా లలితా సహస్రహోమం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి తొలిపావాంచ వద్ద కొలువైయున్న కనకదుర్గమ్మవారి ఆలయంలో అమావాస్య పర్వదినాన్ని పురష్కరించుకొని సోమవారం లలితా సహస్రహోమం అత్యంత ఘనంగా జరిగింది. ఉదయం 10 గంటలకు పండితులు గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి అనంతరం హోమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.11 గంటలకు పూర్ణ హుతి నిర్వహించారు.వేద పండితులు వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్ధ,ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో ఈరంకి జగన్నాధరావు,సూపరింటెండెంట్ భ్రమ రాంబ దేవస్థానం అధికారులు,సిబ్బంది, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.పూజా కార్య క్రమాలను అర్చకులు చెళ్ళపిళ్ళ.ప్రసాద్ శర్మ, కొంపెళ్ళ మూర్తి, కూచిబొట్ల ప్రసాద్, ఆలయ అర్చకులు ప్రయాగ. రాంబాబు నిర్వహించారు.

# గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు శిక్షణ



అచ్యుతాపురం : మండలంలో ఎర్రవరం గ్రామంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై వ్యవసాయశాఖ అధ్వర్యంలో సోమవారం రైతులకు మొదటి దశ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ సహాయ సంచాలకులు జి పద్మజ గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై మొదటి దశలో రైతులు తీసుకొవలిసిన జాగ్రత్తలపై అవగహన కలిపించారు. ఆర్ జి ఎల్ 2537 మూల విత్తనాన్ని 25 ఎకరాలకు సరపరా చేయడం జరిగిందన్నారు. విత్తన శుద్ధి చేసుకోవడం, అంతర దూరం పాటించడం, నారుమడిలో ఎరువుల యజమాన్యం గురించి వివరించారు. జింకు లోపం , ఇనుము ధాతువు లోపం వాటి నివారణకు జింకు సల్ఫేట్ పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయా ధికారి పి.రంగాచారి, రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారులు ఎం విజయలక్ష్మి, పి.విజేత, లోకేష్, రైతులు తదితరులు ఉన్నారు.

# జొన్న జగబందుకు సంతాపం



విశాఖపట్నం : షిప్‌యార్డ్‌లోని జె&సి డిపార్ట్మెంట్‌లో సూపర్ వైజర్‌గా చేసి రిటైర్ అయిన పార్టీ సభ్యులు, మత్స్యకార్మిక నాయకులు జొన్న జగబందు ఆదివారం రాత్రి 9.30 కి శ్రీనగర్ నుండి శ్రీహరిపురం హాస్పటిల్‌కి తీసుకు వెళుతుండగా మార్గ మధ్యలో గుండె పోటుతో మరణించారు.సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు కాॱసిహెచ్.నర్సింగ రావు, సిపిఎం నగర కార్యదర్శి డాॱబి.గంగారావు వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కాॱ జొన్న జగబందు గారు 1967నుండి యువజన సంఘంలో పనిచేశారు. పార్టీ, ప్రజాసంఘాలలో వివిధ పోరాటా లలో పాల్గొన్నారు. ముఖ్యంగా మత్స్యకార ఉద్యమములో కీలకపాత్రపోషించారు. షిప్‌యార్డ్‌లో కార్మికుల పక్షాన అహర్నిసలు కృషిచేసారు. వివిధ కమిటీలలో పనిచేసారు. 2010లో రిటైర్డ్ అయిన తరువాత గాజువాకలో దిబ్బపాలెంలో నివాసం ఉంటు న్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కూమారుడు ఉన్నారు.జొన్న జగబందు కుటుంభానికి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) గ్రేటర్ విశాఖనగర కమిటీ సంతపాన్ని తెలియజేస్తుంది.

# కరోనా వ్యాప్తి బారిన పడకుండా తగు సూచనలు సలహాలు

## డివిజన్ అధ్యక్షులు తోట పద్మావతి

విశాఖపట్నం : 34వ డివిజన్ లో కరోనా వ్యాప్తి ఉధృతముగ ఉన్నందున లక్మిదేవి పేట, అంబేద్కర్ కాలనీ, జెండచెట్టు ప్రజలను తగు జాగ్రత్తలు పాటించుట కొరకు డివిజన్ అధ్యక్షులు తోట పద్మావతి ఆధ్వర్యంలో కరోనా బారిన ప్రజలు ఎవ్వరు పడ కుండా ప్రతీ ఒక్క కుటుంబంలో వారిని సందర్శించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని కరోనా వ్యాప్తి బారిన పడ కుండా తగు సూచనలు సలహాలను తెలియ జేయ డం జరిగినది. పై కార్య క్రమంలో సీనియర్ నాయకులు మరియు బూత్ అధ్య క్షులు, లండ రమణ, వాసుపల్లి మసేను, గద్దిపిల్లి అప్పన్న, కడవల నాగమణి, బొడ్డు పోల రాజు, బొడ్డు అప్పారావు, గార తాతబ్బాయి, యాసరపు రాజు, దూడ అప్పారావు, సురపతి దుర్గారావు, చల్లపల్లి సత్తిరాజు, బి.గోవిందు, వాసుపల్లి చిన్న మసేను, నాగుల శ్రీను, ఎలక్ట్రికల్ అప్పారావు, శివారెడ్డి, ఎరకయ్య, బి.నీల కంఠం, వాసు పల్లి రాజు, పిల్లి సత్తిబాబు, కేబుల్ చిన్న, వాడపల్లి అప్పారావు, మరియు తదితరులు పాల్గొన్నారు.



# ఆపత్కాలంలో ఆదుకున్న కందుల నాగరాజు



విశాఖపట్నం : జివియంసి 32వ వార్డ్ ప్రజలకు పెద్ద దిక్కుగా ఉంటూ అన్నివిధాలా ఆదుకుంటున్న కెఎన్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కందుల నాగరాజు సహాయానికి వార్డ్ ప్రజలు ముగ్ధులవుతున్నారు. స్థానికుడవడం వల్ల తమ బాధలు దగ్గరి నుంచి చూస్తూ అవసరానికి అన్నివిధాలా సహాయ పడుతున్నారని నాగరాజు ను స్థానిక ప్రజలు కొనియాడుతున్నారు.తాజాగా వార్డ్ లోని అమ్మణమ్మ అనే వృద్ధురాలు వయోభారంతో మృతిచెందిన విషయం తెలిసిన వెంటనే నాగరాజు స్పందించి మృతురాలి కుటుంబ సభ్యులను పరా మర్శించి ధైర్య వచనాలు చెప్పారు. అలాగే పేదల అంతిమ సంస్కారానికి సహాయం చేస్తానని మాట ఇచ్చిన ప్రకారం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆపత్కాలంలో తమకు సహాయం చేసిన నాగరాజుకు మృతురాలి కుటుంబ సభ్యులు కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు.

# కోవిడ్ -19పై పోలీసులకు అవగాహన సదస్సు

## ముఖ్య అతిథిగా పోలీసు జిల్లా వైద్యాధికారిణి పద్మజ హాజరు



పరవాడ : దేశాన్ని అతలాకుతలం చేస్తున్న కరోనామహమ్మరి పై సోమవారము పరవాడలో గల మరిడిమాంబ కమ్యూనిటీహల్ లో సోమవారం పోలీసులుకు అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమానికీ ముఖ్యఅతిథిగా వైజాగ్ పోలీసు వైద్యాదికారణి పద్మజ హజరైన్నారు. అనంతరముఈకార్యక్రమాన్ని ఉద్దేశించి అమె మాట్లడుతూప్రతి ఒక్క పోలీసు ఉద్యోగీతనతో పాటుగా సబ్బు, సానిటైజర్ ను డ్యూటికీ తెచ్చికోవాలని అన్నారు.తరుచుగా చేతు లను శుభ్రం చేసికోవాలని కోరారు. సబ్బు మరియు నీరు ఉపయోగించి అల్కహాల్ కలిగిన ద్రావణంతో శుభ్రం చేసుకోవాలి అన్నారు. ఇతరులుతో కరచాలనం చేయరాదు అన్నారు. కనులు, ముక్కు, నోటీని అనవసరంగా తాకరాదు అని కోరారు. ఎల్లవేళలా కార్యలయంలో మరియు బయట విదుల్లో తప్పనిసరిగా మాస్క్ దరించాలనీ తెలిపారు. వ్యక్తులు మద్య సామాజిక దూరం పాటించాలని కోరారు. జ్వరం, దగ్గు, గొంతు బొంగరంపోవుట, రొంప తదితర కరోనా లక్షణాలు ఉంటే దగ్గరలోనే ఉన్నా ప్రభుత్వ అస్పత్రిలో టెస్టులు చేయించుకోవాలనీ కోరారు. గుర్తింపులేని అర్ఎమ్‌పి డాక్టర్లు వద్ద చికిత్స తీసుకోవద్దు అన్నారు. ప్రజా బాహాద్యం గల ప్రదేశంలో ఉమ్మి వేయరాదు అని తెలిపారు. బెటాడిన్ ద్రావణంతో పుక్కిలించడం వలన కొంతవరకు కరోనాను నివారించవచ్చు అన్నారు.

ఈ కార్యక్రమంలో సిబిసి సిఐఎస్ కృష్ణమూర్తి, హోంగార్డు డియస్ పి.చంద్రబాబు, ఎస్ఐలు రమణయ్య, రామకృష్ణ, రవికుమార్, అప్పారావు మరియు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

గొలుగొండ : గొలుగొండ మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సిపిఐ మండల కార్యదర్శి ఎం.రాము నాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో అటవీ బంజరు భూములు పట్టాలు ఇవ్వాలంటూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ...

మండలంలో అటవీ బంజరు భూములు గిరిజనులకు పట్టాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అటవీ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పడంతో సరిపోదని ఎప్పటివరకు గిరిజనులకు పట్టాలు ఇవ్వలేదని ఆయన ఎద్దేవా చేశారు. మండలంలో ఎల్లంకి, కె.ఎల్లవరం, పప్పుశెట్టిపాలెం తదితర గ్రామాల్లో జీడి, సరుగుడు తదితర వ్యవసాయం గత 20 సంవత్సరాలుగా సాగు సాగిస్తారని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి మేక సత్య నారాయణతో పాటు పలు గ్రామాల గిరిజన రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో

# వ్యక్తికి గాయాలు

గొలుగొండ : గొలుగొండ మండలం ద్వారకానగరం కల్వర్ట్ దగ్గర జోగుంపేట నుండి గొలుగొండ వెళుతున్న బైక్ టాటా మ్యాజిక్ ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలు అవ్వడంతో గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ప్రస్తుతానికి తీవ్ర రక్తస్రావం కావడంతో నర్సీపట్నం ఏరియా హాస్పటల్‌కు తరలించినట్లు తెలిపారు.





కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా సోమవారం 31వ వార్డ్, ఎస్‌బిఐ కాలనీ, చాకలి పేట ఏరియాలో ఇంటి ఇంటికి, మలేరియా సిబ్బందితో సోడియం హైపో క్లోరైడ్ స్ప్రేయింగ్‌ని జివియంసి వారి సహకారంతో చేయిస్తున్నమాజీ కార్పొరేటర్ జివియంసి, సాయి పూజా ఫౌండేషన్ ఛైర్మన్ వానపల్లి రవికుమార్, వార్డు సెక్రటరీ సారిపల్లి మహేష్, నరేష్, నాయుడు, కనక రాజు, మంగ, శ్రీనివాస్, శేఖర్, జివియంసి మలేరియా హెల్త్ అసిస్టెంట్ అప్పారావు, పబ్లిక్ హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయవాది మల్లాది ఇకలేరు



విశాఖపట్నం : ప్రముఖ న్యాయవాది మల్లాది సూర్య నారాయణ శాస్త్రి (95) అనారోగ్యం కారణంగా ఆదివారం రాత్రి డాబాగార్డెన్స్ సాయిబాబా వీధిలో ఉన్న వారి నివాసంలో కన్ను మూశారు. న్యాయవాది వృత్తిలో ఎందరికో సేవలు అందించి ఖ్యాతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. శాస్త్రికి ఆధ్యాత్మిక ఉపన్యాసాలన్నా, సంగీతమన్నా ఇష్టపడేవారు. క్రమ శిక్షణ మారు పేరుగా నిలిచిన శాస్త్రి అకాల మరణాన్ని ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. సోమవారం ఉదయం జ్ఞానాపురం హిందూ స్మశాన వాటికలో ఆయన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు న్యాయ వాదులు, కళాకారులు పెద్దఎత్తున హాజరై ఘనంగా నివాళులర్పించారు.

# పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ



పరవాడ : పరవాడ మండలం తానం గ్రామంలో జనసేన పార్టీ వారి ఆధ్వర్యంలో పరదేశిమాంబ గుడి వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు, అనంతరము పారిశుద్ధ్య కార్మికులకు ఐదు కేజీల రైస్ మరియు 9 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పెందుర్తి నియోజక వర్గం సీనియర్ నాయకులు మోటూరు సన్యాసి నాయుడు, చుక్కా నాగు, మోటూరు హరి, తానం జనసైనికులు శ్రీను (గబ్బర్), ఆచారి, కృష్ణ, పవన్ మరియు తదితర జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

# చోడవరంలో కలవరపెడుతున్న కరోనా

## కోర్టు సిబ్బందికి, ఎమ్మెల్యే డ్రైవర్ కు కరోనా పాజిటివ్

చోడవరం : చోడవరం పట్టణంలోని రోజురోజుకు కరోనా కొత్త కేసులు తెలుగు చూస్తుండడంతో స్థానికంగా కలవరపెడుతోంది. చోడవరం కోటల సముదాయంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఏడు గురికి కరోనా పాజిటివ్ లక్షణాలు సోమవారం వెలుగు చూడడంతో స్థానికంగా ఉద్యోగుల లో ఆందోళన వ్యక్తమైంది. కోర్టులో పని చేస్తున్నా 60 మంది ఉద్యోగులకు దశలవారీగా కోవిడ్ పరీక్షలు ఇటీవల నిర్వహించారు. వారిలో చోడవరంలో నివ సిస్తున్న ఇద్దరు కు, అలాగే విశాఖపట్నం, ఎలమంచిలి, అనకా పల్లి నుంచి వస్తున్న మరో ఐదుగురికి లక్షణాలు కనిపించినట్లు వైద్య వర్గాలు ధృవీకరించారు. దీంతో వారిని ఐసోలేషన్ కు తరలించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ కారు డ్రైవర్ కు కరోనా పాజిటివ్ లక్షణాలు ఉన్నట్లు తేలడంతో ఐసోలేషన్ కు తరలించారు. కాగా గత వారం రోజుల నుండి చోడవరం పట్టణంలో కరోనా కేసులు వెలుగు చూస్తుండటంతో స్థానికులలో ఆందోళన నెలకొంది.

# ఎన్టీపీసీలో ఓపెన్ జిమ్ ప్రారంభం

## ముఖ్య అతిథిగా సిజిఎమ్ సుదర్శన్‌బాబు



పరవాడ : సింహాద్రి ఎన్టీపిసి దీపాంజలి నగర్ లోని షాపింగ్ సెంటర్ వద్ద రెండులక్షలు వెచ్చించి ఓపెన్ జిమ్ ను ఏర్పాటు చేశారు. ఈజిమ్ ప్రారంభానికి ముఖ్య అతిథిగా సిజిఎమ్ సుదర్శన్ బాబు హాజరై అయన చేతులు మీదగా ప్రారంభించారు. సంస్థ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు అందరూ ఈజిమ్ ను వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిఎమ్‌లు కృష్ణా, రామారావు దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షు రాలు అరుణజ్యోతి, హెచ్ అర్ ఎజిఎమ్ మరియు పిఆర్వో మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ వ్యాధిగ్రస్థునికి అండగా నిలిచిన ఎంపీ భర్త శివప్రసాద్

కొయ్యూరు : కిడ్నీ వ్యాధితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి భర్త శివ ప్రసాద్ అండగా నిలిచారు. ఇటీవలే తరచుగా వివిధ వ్యాధులతో బాధపడు తున్న వ్యక్తులకు, కరోనా కారణంగా ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తూ వారికి భరోసా కల్పిస్తూ శివప్రసాద్ ప్రశంసలు అందు కుంటున్నారు. మరోసారి ఆయన మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే కిడ్నీ వ్యాధి, శ్వాస సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్న కొయ్యూరు మండలం శరభన్నపాలెం గ్రామానికి చెందిన ఇర్రట రాజుబాబును సోమవారం విశాఖపట్నంలో శివప్రసాద్ పరామర్శించి ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకొని, వైద్య నిమిత్తం కొరకు 10వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని బాధితుడి కుమారుడికి అందజేసి అధైర్య పడవద్దని బాధితుడికి ధైర్యం చెప్పారు.



ఆర్థిక సాయం చేస్తున్న ఎంపీ భర్త శివప్రసాద్

ఇకపై ఎలాంటి అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నేరుగా శివ ప్రసాద్ పరామర్శించడంతో బాధితుడు ఆనందం వ్యక్తపరిచాడు. శివప్రసాద్‌తో పాటు రీమల భీమరాజు పాల్గొన్నారు.

# ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య అనారోగ్యంతో మృతి



విశాఖపట్నం : ప్రముఖ చిత్రకారుడు దివంగత వంకాయల మల్లయ్య శాస్త్రి 96 సంవత్సరాలు అక్కయ్య పాలెం, నరసింహానగర్‌లో ఆయన నివసిస్తున్న ఇంటిలో అనారోగ్యంతో మృతి చెందారు. చిత్ర కళాకారుడిగా విశాఖలో చక్కని ఖ్యాతిని పొందారు. తన జీవితకాలంలో ఎన్నో ఘన సత్కారాలను ప్రశంసలను పొందారు. వీరి అకాలమృతి చిత్ర కళాకారులకు తీరని లోటని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. వారి పార్థీవ దేహాన్ని కొసనా కల్చరల్ అకాడమి అధ్యక్షురాలు సుశర్ల శేషమణి, వివిధ సాంస్కృతిక సంస్థలకు చెందిన కళాకారులు సందర్శించి నివాళులర్పించారు.

# భీమిలి లో ఐదు పాజిటివ్ కేసులు నమోదు



భీమునిపట్నం : భీమిలి లో సోమవారం ఐదు కేసులు రావడంతో మెయిన్ రోడ్ ని కంటోన్మెంట్ జోన్ చేసి బారికేడ్ లు గంట స్తంభం దగ్గర పాత బస్సు స్టాండ్ దగ్గర వేశారు. సోమవారం మెయిన్ రోడ్ లో మూడు ఎన్‌టిఆర్ కాలనీ లో రెండు కేసులు నమోదు అయ్యాయని జోనల్ కమిషనర్ సి.హెచ్.గోవిందరావు తెలిపారు.

# నేడు, రేపు స్వామివారి జయంతి మహోత్సవాలు





అన్నవరం : తూర్పు గోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్య నారాయణ స్వామి వారి దేవస్థానం అన్నవరం నందు శ్రీ స్వామి వారి 130వ అవిర్భావ మహోత్సవములు (జయంతి) ది.21.07.2020 నుండి 22.07.2020 వరకు నిర్వహించబడును. ది.22.07.2020 వ తేది బుధవారం శ్రీ స్వామి వారి జయంతి మహోత్సవం...


శ్రీ స్వామివారి సన్నిధిలో పరిమిత సిబ్బందితో అత్యంత వైభ వంగా నిర్వహించుటకు గానూ వైదిక కమిటీ వారు నిర్ణయించడమైనది. కరోనా వైరస్‌లి దృష్ట్యా శ్రీయుత కమిషనర్ దేవాదాయ శాఖ వారు జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి...

'శ్రీ సత్యనారాయణ స్వామి వారి జయంతి మహోత్సవము శ్రీ స్వామివారి సన్నిధిలో అతి కొద్ది మంది అర్చకులు, వేద పండితులు, మరియు పరిమిత సిబ్బందితో మాత్రమే శాస్త్రోక్తంగా నిర్వహించుటకు గాను నిర్ణయించడమైనది.

# జాతీయ గ్రామీణ ఉపాధి పనులు లేక అవస్థలు?

అరకులోయ : మండలంలోని గన్నెల పంచాయతీ తడక. పొలంగూడ. కాగు వలస గ్రామాల అర్హులైన ఉపాధి హామీ కూలీలు ఉపాధి పనులు లేకపోవడంవల్ల అవస్థలు పడు తున్నామని వాపోతున్నారు పనిదినాలు ఉన్నప్పటికీ ఉపాధి పని కల్పించకపోవడం వల్ల నిత్యావసరాలు అత్యవసర లు చేయడానికి చాలా కష్టం లో వాళ్లతో గడపడానికి ఇబ్బంది కరంగా ఉందని పంచాయతీ పరిధిలో గల ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు వ్యవసాయం పొలం పనులు పూర్తి చేసుకొని కరోనా కష్టకాలంలో బయట ఎక్కడికి వెళ్లే అవకాశం లేకపోవడంతో గ్రామంలో ఎటు వంటి కూలి పనులు దొరకక ఇబ్బందులు పడుతున్న మన్నారు కరుణ ఉధృతి రోజు రోజుకి ఎక్కువ అవడంతో కుటుంబాలతో పూట గడపడానికి ఉప్పు వరక కూడా కొనుక్కో లేని పరిస్థితిలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మన్నారు సంబంధిత అధికారులు గుర్తించి అర్హులైన పని దినాలు ఉన్న రైతుల కు పని కల్పించాలని పలువురు కోరుతున్నారు.

# పేదలకు నిత్యావసరాలు పంపిణీ



యానాం : కరోనా వైరస్ నేపథ్యంలో ఇబ్బందులకు గురి అవుతున్న యానాం ప్రాంత యాభై పేద కుటుంబాలకు షేక్ లాల వీధికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పట్టా రామచంద్ర రావు ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఆరు కేజీల వివిధ రకాల కూరగాయలు, నూనె, పప్పులు తదితర నిత్యవసర సరుకులు పేద కుటుంబాలకు పంపిణీ చేసి వారి దాతృత్వాన్ని చాటు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ వ్యాప్తి వలన పేదవారికి చేసుకోవడానికి పనులు లేక గత నాలుగు నెలలుగా తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారని అలాంటివారిని ఈ కష్టకాలంలో ఈ చిన్న సహాయం చేయడం ఆనందంగా ఉన్నది అన్నారు. గత నాలుగు నెలలుగా అనేక రకాలుగా పేదవారికి సహాయం చేస్తున్న రామ చంద్రరావు కుటుంబాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

# అనంతగిరి మండలంలో కరోనా కేసు నమోదు

అనంతగిరి : అనంతగిరి మండలం భీమవరం పిహెచ్‌సి పరిధిలోని నేరేడువలస లో 36 సంవత్సరాల మహిళకు కరుణ నిర్ధారణ అయింది.

పాడేరు తరలించేందుకు ఏర్పాట్లు అవుతున్నాయి.

# నేడు ఎంపీ, ఎమ్మెల్యేలు పర్యటన

కొయ్యూరు : ఈ నెల 22న బుధవారం ఉదయం 10 గంటలకు కొయ్యూరు మండలం ఆడాకుల పంచాయతీ డి.కొత్తురు, బాలారాం పంచాయతీ డి.మల్లవరం వన మహోత్సవం కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఎంపి గొడ్డేటి మాధవి రానున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. కావున మండల నాయకులు కార్యకర్తలు సామజిక దూరం పాటించి విధిగా మాస్కులు ధరించి హాజరు కావాలని కోరారు.

# వైజగపటం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న విసిసిఐ యూత్ వింగ్ మొదటి వార్షిక సర్వసభ్య సమావేశం





విశాఖపట్నం : వైజగపటం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న విసిసిఐ యూత్ వింగ్ తన మొదటి వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించింది. COVID-19 కారణంగా అపూర్వమైన సమయాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహించబడింది.విసిసిఐ, విసిసిఐ మహిళా విభాగం మరియు విసిసిఐ యువజన విభాగం కార్యవర్గం సభ్యులు పాల్గొన్నవారిని స్వాగతించారు. ఈ సంవత్సరంలో నిర్వహించిన కార్యక్రమాలను విసిసిఐ యువజన విభాగం వివరించడం జరిగింది. ముఖ్యంగా అమెరికన్ కాన్సులేట్ తో కలసి రౌండ్ టేబుల్ సమావేశం లో పాల్గొనడం. మరియు ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక మరియు యువజన శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గారితో సమావేశం జరిగింది. బిగ్ షిఫ్టు 'ఎకోసిస్టమ్ పార్ట్నర్ గా , శారదా మెటల్స్ మరియు అల్లాయ్స్ లిమిటెడ్ ను పారిశ్రామిక సందర్శించడం ఏర్మరియు సిలికాన్ వ్యాలీలో పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి సారించి ఏంజెల్ ఇన్వెస్టింగ్ వారితో కలసి సెమినార్ నిర్వహించి 20-21 సంవత్స రానికి సంబంధించిన ప్రణాళి కలను చర్చించారు. రాబోయే వారంలో కోవిడ్ వారియర్ లకు 2000 మాస్కులు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. 2020-2022 సంవత్సరానికి కార్యనిర్వాహక బృందం అధ్యక్షుడు గా సివి అనిరుధ్ రావు, కార్యదర్శి - రోహిత్ కంచర్ల ఎన్నిక కాబడ్డారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా జివిఎంసి కమిషనర్ జి. శ్రీజన, ఐఎఎస్ పాల్గొని ఒక సంవత్సరం పూర్తయినందుకు జట్టును అభినందించారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూవు నగరం లోని కొవిడ్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రణాళికలపై చర్చించారు అలాగే జివిఎంసి వద్ద ఆర్థిక దృక్పథాన్ని మెరుగుపరిచేందుకు విసిసిఐ ఆలోచనలను చేయాలనీ సూచించారు. విసిసిఐ యువజన విభాగం 55 మంది సభ్యులతో నగరంలోని ప్రముఖ వ్యాపార సంస్థలు, నిపుణులు, వ్యవస్థాపకులు మొదలైన వారి సభ్యులను ఆకర్షించింది. గ్రూప్ ఛైర్మన్ శ్రీ గ్రంధి మల్లికార్జున రావు ప్రారంభించారు.

# అరకులోయ శాసనసభ్యులు చెట్టి ఫాల్గుణపై జేఏసీ ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నాము

## వైసీపీ మండలపార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్



అనంతగిరి : మండల కేంద్రంలో సోమవారం మండల వైసీపీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్ అధ్యక్షతన సమావేశం జరిగింది ఈకార్యక్రమంలో శెట్టి ఆనంద్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం జేఏసీ వారు అరకు లోయ శాసనసభ్యులు చెట్టి ఫాల్గుణ పై ఆరోపణలు చేస్తూ కరపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని వాల్లు చేసిన ఆరోపణలు నిరాధారమని, వాల్లు ఆరోపణలు నిరూపించగలగాలని తప్పుడు ఆరోపణలు చేసి మానాయకుడిని అగౌవరవ పరచడానికి ప్రయత్నం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. రాజకీయాలు చేయాలనుకునే వారు వారి ఉద్యోగాలు రాజీనామా చేసి ప్రజలకు సేవచేసి ప్రజల మన్ననలు పొందవచ్చని అంతేగానీ ఉద్యోగాలు చేస్తూ పాఠశాల లకు వెల్లకుండా ఆరోపణలు చేయడం సరికాదని జేఏసి నాయకులకు హితవు పలికారు

మా నాయకుడు చెట్టి ఫాల్గుణ రాజకీల్లో కి వచ్చేటప్పుడు ఉద్యోగం రాజీనామా చేసి ప్రజలకు సేవ చేస్తూ ఎన్నికల్లో పాల్గొని ప్రజల ఆశీస్సులతో గెలిచారని మచ్చలేని నాయకుడు మా శాసనసబ్యులు చెట్టి ఫాల్గుణ అని ఆయన అన్నారు,గిరిజనుడకు ప్రజల్లో మంచి పేరు రావడం చూసి ఓర్వలేకనే కొంతమంది జేఏసీ ముసుగులో ఇటువంటి పసలేని ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు ఈకార్యక్రమంలో జెడ్పీ టీసీ అభ్యర్థి రేగబోయిన స్వామి, వైసీపీ నాయకులు,శెట్టి లక్ష్మణరావు,శిరగం అశోక్, మిత్రులు, గంగులు, కొర్ర సూర్య నారాయణ, సుబ్బారావు,దూరు జయ, తదితరులు పాల్గొన్నారు.

# వికాసా కార్యాలయంలో హెూమ్ ఐసోలేషన్ మరియు 108 కంట్రోల్ రూమ్స్ ఏర్పాట్లు సందర్శన



కాకినాడ : జిల్లాలో హెూమ్ ఐసోలేషన్ లో ఉంటున్న కరోనా పాజిటివ్ వ్యక్తుల యొక్క ఆరోగ్య పరిస్థితిని మరియు వారికి అందుతున్న సేవలు వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకొనుట గాను జిల్లా స్థాయిలో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డి మురళీధర్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం జిల్లా కలెక్టర్ డి మురళీధర్ రెడ్డి జాయింట్ కలెక్టర్ (డబ్ల్యు) జి.రాజకుమారి తో కలిసి కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న వికాస కార్యాలయానికి సంబంధించిన భవనాలను పరిశీలించారు. ఈ కంట్రోల్ రూమ్ నుండే జిల్లాలో ఉన్న 108 అంబులెన్స్ వాహనాలను కూడా పర్యవేక్షణ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టరు వెంబడి డిఆర్వో సిహెచ్. సత్తిబాబు, వికాస పిడి కె. లచ్చరావు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలి

## సంజయ్,సాంబమూర్తినగర్ వాసులకు పౌష్టికాహారం పంపిణీ



కాకినాడ : కోవిడ్ నేపధ్యంలో ప్రతిఒక్కరు తప్పనిసరిగా పౌష్టికా హారం తీసుకోవాలని, తద్వారా వ్యాధినిరోధకశక్తి పెంపొం దుతుందని దైవసేవకులు,సువార్తికులు రెవ.నక్కా షాలేం రాజు పేర్కొన్నారు.

సామాజిక సేవలో భాగంగా స్థానిక సాంబమూర్తినగర్, సంజయ్ నగర్ ప్రాంతాల్లో కోవిడ్ బాధిత కుటుంబాలకు పండ్లు, గ్రుడ్లు, అల్లం, పసుపు, నిమ్మకాయలు, పాలు పెరుగు వంటి పోషక విలువలుగల ఆహార పదార్థాలు సుమారు ముప్పై కుటుంబాలకు సోమవారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైరస్ బారినపడిన వ్యక్తులు మంచి ఆహారం వేడిగా తీసుకోవాలని,ధైర్యంగా ఉండి త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నానని అన్నారు.కార్యక్రమంలో షాలేం రాజు కుటుంబ సభ్యులు,దైవ సేవకులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా సంతృప్తికరంగా ఎరువుల లభ్యత: కేంద్రమంత్రి డి.వి.సదానందగౌడ

## తెలంగాణాలో యూరియా అందుబాటుపై కేంద్ర మంత్రి డి.వి.సదానంద గౌడను కలిసిన తెలంగాణా వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో దేశవ్యాప్తంగా ఎరువులకు డిమాండ్ పెరిగినట్టు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ డి.వి.సదానంద గౌడ తెలిపారు. ఈ అవసరానికి తగినట్టుగా ఉత్పత్తిదారులు, రాష్ట్రప్రభుత్వాలతో సన్నిహిత సహకారంతో పనిచేస్తున్నామని సదానందగౌడ తెలిపారు. దీనికితోడు డిమాండ్‌కు తగినట్టుగా సరఫరాను పెంచడానికి దిగుమతుల సైకిల్‌ను కుదించినట్టు కూడా మంత్రి చెప్పారు. తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రాష్ట్రంలో యూరియా డిమాండ్ కు సంబంధించి కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ డి.వి.సదానందగౌడను కలిశారు. ఈ సారి రుతుపవనాలు ఊహించినదానికంటే మెరుగ్గా ఉండడంతో రాష్ట్రంలో రైతుల యూరియా వాడకం, డిమాండ్ లోపెరుగుదల కనిపించిందని చెప్పారు. అలాగే గత ఏడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో తెలంగాణాకు సరిపడినంత యూరియా సరఫరా చేయాల్సిందిగా ఆయన కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై స్పందిస్తూ శ్రీ డి.వి.సదానందగౌడ, దేశవ్యాప్తంగా ఎరువులు సంతృప్తికర స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, రాష్ట్రాల వద్ద తగినన్ని నిల్వలు ఉ న్నాయని చెప్పారు. ప్రస్తుత నాట్ల కాలంలో ఇంకా ఏవైనా అదనపు డిమాండ్ ఉంటే సరఫరాను వేగవంతం చేస్తామని అన్నారు. సకాలంలో రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

# రూ .9,500 కోట్లతో పుదుచ్చేరి వార్షిక బడ్జెట్

## - సభకు రాని ఎల్టీ కిరణ్ బేడీ - యధావిధిగా సమావేశం

యానాం : 2020-21 ఆర్థిక సంవత్సర పుదుచ్చేరి బడ్జెట్ ను ఆర్థికశాఖను సైతం నిర్వహిస్తున్న సిఎం నారాయణసామి సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు . స్పీకర్ శివకొలిందు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎల్టీ కిరణ్ బేడీ మొదటిగా ఉపన్యసించాల్సి ఉన్నప్పటికీ ఆమె సోమవారం ఉదయం 9:గంట రాకపోవడంతో 15 నిమిషాలు సభ్యులు వేచియున్నారు. అనంతరం సిఎం నారాయణసామి రూ .9.500 కోట్లుతో బడ్జెట్ ను సభలో ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా వివిధ పథకాలను ఆయన ప్రకటించారు. బిపిఎల్ కుటుంబాలకు 100 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని, పాఠశాలల్లో విద్యార్థుల బ్రేక్ ఫాస్ట్ కరుణానిధి పథకం ద్వారా ఇడ్లీ, కిచిడి, పొంగల్ ను నవంబర్ 15 నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

బిపిఎల్ విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుందని, రేషన్ షాపుల్లో ఒకే దేశం ఒకే రేషన్ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. మంత్రుల మల్లాడి కృష్ణారావు, కందసామి, నమశ్శివాయం తదితరులు పాల్గొన్నారు.

# మాస్క్ లేకుండా కస్టమర్లను బ్యాంకుల్లోకి అనుమతించవద్దు

## విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐ.పి.ఎస్



విజయనగరం : వ్యాపారవేత్తలు, ప్రజలు విజయనగరం జిల్లాలో స్వచ్ఛందంగా లాక్‌డౌన్ పాటించేందుకు ముందుకు రావడంతో లాక్‌డౌన్ నిబంధనలు పటిష్టంగా అమలయ్యే విధంగా చూడాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐపిఎస్ సోమవారం ఆదేశించారు. లాక్‌డౌన్ అమలు తీరును పరిశీలించేందుకుగాను జిల్లా ఎస్పీ బి.రాజకుమారి పట్టణంలో పలు ప్రాంతాలను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. విజయనగరం పట్టణంలోని ఆర్టీసి కాంప్లెక్సు, బాలాజీ జంక్షను, కోట, గురజాడ సర్కిలు, గంట స్థంభం, కన్యకా పరమేశ్వరి కోవెల, ఎన్‌సిఎస్, నాయుడు ఫంక్షను హాలు, గూడ్సు షెడ్, బాలాజీ మార్కెట్, కలెక్టరుఆఫీసు జంక్షను ప్రాంతాలను సందర్శించారు. లాక్‌డౌన్ నిబంధనలు అమలులో ఉన్నందున ఉదయం 11 గంటలకు షాపులు మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులును జిల్లా ఎస్పీ ఆదేశించారు. మద్యం షాపుల వద్ద మద్యం కొనుగోలుదారులు భౌతిక దూరం పాటించేటట్లు, మాస్కులు ధరించే విధంగాను చూడాలన్నారు. గురజాడ సర్కిల్ వద్ద సంజీవిని వాహనాన్ని జిల్లా ఎస్పీ పరిశీలించారు. అనంతరం, కన్యకా పరమేశ్వరి కోవెల దగ్గరగల స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను సంద ర్శించి, కస్టమర్లు భౌతిక దూరం పాటించే విధంగా చూడాలని బ్యాంకు అధికారు లుకు సూచించారు. విజయనగరం జిల్లాలో కరోనా కేసుల పెరుగుతున్నదృష్ట్యా బ్యాంకు మేనేజ్ మెంట్‌లు అప్రత్తమంగా వ్యవహరించాలన్నారు. బ్యాంకులకు వచ్చే వినియోగదారులకు శానిటైజర్లు అందుబాటులో ఉంచాలన్నారు.వినియోగదారులు పనుల మీద బ్యాంకుకు వచ్చేటప్పుడు సాధ్యమైనంత వరుకు బ్యాంకు బయటనే ప్రత్యేకంగా కౌంటరు ఏర్పాటు చేసి, చిన్న చిన్న అవసరాలను తీర్చి పంపే విధంగా చర్యలు చేపట్టాలని, సాధ్యమై నంత వరకు ఆన్‌లైను లావాదేవీలను ప్రోత్సహిం చాలన్నారు. బ్యాంకు కౌంటర్ల వద్ద మూకుమ్మడిగాలావాదేవీలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తుల మధ్య కనీసం ఆరడగుల భౌతికదూరం పాటించాలన్నారు.తప్పనిసరిగా మాస్కులు ధరించా లని, మాస్కులు లేకుండా కస్టమర్లను బ్యాంకుల్లోకి అనుమతించ వద్దన్నారు. బ్యాంకు ఆవరణలో ఉన్న గోడలను, తలుపులు, వాటి హేండిల్స్‌ను, కౌంటర్లును తరుచూ శానిటైజరుతో శుభ్రం చేయాలన్నారు. బ్యాంకు సిబ్బంది తప్పనిసరిగా ఫేస్ షీల్డులు వాడాలన్నారు. క్యాష్ కౌంటరులో ఉండే సిబ్బంది డబ్బులను లెక్కించే సమయంలో శానిటైజరుతో చేతులను శుభ్రపర్చుకోవాలన్నారు. కరోనా వ్యాధి లక్షణాలు పొడి దగ్గు, జ్వరం, గొంతు నొప్పి, జలుబు వంటి లక్షణాలు ఉన్న బ్యాంకు సిబ్బందికి వెంటనే కరోనా నిర్ధారణపరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షల రిపోర్టులు వచ్చే వరకు గృహ నిర్భందంలోనే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేయకుండా కుటుంబసభ్యులు, ఇతరులను కలిసేందుకుస్వస్తి పలకాలని జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి బ్యాంకు అధికారులు, కస్టమర్లకు సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి 'టెలి-స్పందన'

## విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐ.పి.ఎస్



విజయనగరం : విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల ఫిర్యాదు లను పరిష్కరించేందుకు 'టెలీ-స్పందన' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐ.పి.ఎస్., సోమవారం నిర్వహించారు. 'టెలీ-స్పందన' కార్య క్రమంలో భాగంగా జిల్లా ఎస్పీగారు, జిల్లా పోలీసు కార్యాలయంలో 08922276163 ద్వారా 07 ఫిర్యాదు లును స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ కరోనా వ్యాధి వ్యాప్తి కారణంగా ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంను తాత్కాలికంగా నిలుపుదల చేసి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకుగాను ప్రతీ సోమవారం 'టెలీ-స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామన్నారు. కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉన్న కారణంగాను, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, టెలి స్పందన కార్యమ్రాన్ని నిర్వహించి, ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు.ఇకపై ప్రజలెవ్వరూ సోమవారం నాడు ఎస్పీ కార్యాలయానికి రానవసరం లేదని జిల్లా ఎస్పీ తెలిపారు. 'టెలీ-స్పందన' కు ఫోను ద్వారా వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ విని, పరిశీలించి పరిష్కారం నిమిత్తం, సంబంధిత అధికారులను ఆదేశించారు. ''టెలిస్పందన'' కార్యక్రమంకు వచ్చిన కొన్ని ముఖ్యమైన ఫిర్యాదులు.

బొబ్బిలి పట్టణం, తారకరామ కోలనీకి చెందిన డి.గురువులు జిల్లా ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తమ కోలనీకి చెందిన ఒకామె తనవద్దనుండి 4 సంవత్సరాల క్రితం రూ. 2 లక్షల రూపాయిలు అప్పుగా తీసుకొని, తిరిగి ఇవ్వడంలేదని, తన డబ్బులు ఇప్పించి తనకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ విచారణ జరిపి, చర్యలు తీసుకోవాల్సిందిగా బబ్బిలి సి.ఐను ఆదేశించారు. డెంకాడ మండలం, బడ్డవలస పంచాయితీ, కృష్ణాపురం గ్రామానికి చెందిన ఒకామె జిల్లా ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తనకు కృష్ణాపురం గ్రామపరిధిలో ఒక ఇంటిస్థలం ఉన్నదని, సదరు ఇంటిస్థలంలో రేకుల షెడ్ వేసుకొని కరెంటు మీటరు బిగించి ఉండగా, అదే గ్రామానికి చెందిన రమణయ్య అనేఅతను తన రేకుల షెడ్‌ను కూల్చివేసి, తన కరెంటు మీటరును అతనియొక్క ఇంటికి బిగించుకొని వాడు కొంటున్నాడని, సదరు రమణయ్యపై చర్య తీసుకొని, తనకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ విచారణ జరిపి, చర్యలు తీసుకోవాల్సిందిగా డెంకాడ ఎస్.ఐను ఆదేశించారు. నెల్లిమర్ల గ్రామానికి చెందిన ఒకామె జిల్లా ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట గ్రామంలో తన భర్త మరియు అత్త తనను ఇంటినుండి బయటకు పంపివేసినట్లు, వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ విచారణ జరిపి, చర్యలు తీసుకోవాల్సిందిగా నెల్లిమర్ల ఎస్.ఐను ఆదేశించారు. విజయనగరం పట్టణం, నల్లావీధికి చెందిన టి.సురేష్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తూ వెయింగ్ మెషీన్ బ్యాటరీల కొరకు రూ. 18,300/లు హైదరాబాద్‌కు చెందిన త్యాగి చండేలా ఎంటర్‌ప్రైజస్ బ్యాంకు అకౌంటుకు పంపినట్లు, తనకు ఇప్పటివరుకు బ్యాటరీలు గాని, డబ్బులుగాని రాలేదని, తనకు బ్యాటరీగాని, డబ్బులు గాని తనకు ఇప్పించి, తనకు న్యాయం చేయవలసిందిగా కోరారు. ఈ ఫిర్యాదు పై స్పందించిన జిల్లా ఎస్పీ విచారణ చేపట్టి, ఫిద్యాదికి న్యాయం చేయాల్సిందిగా విజయనగరం 1వ పట్టణ ఎస్.ఐని ఆదేశించారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ స్వయంగా ఫోనులో మాట్లాడి, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వెంటనే తనకు నివేదించాలని అధికారులను జిల్లా ఎస్పీ బి. రాజకుమారి ఆదేశించారు.

# కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో సీఎస్ఈ-2019 అభ్యర్థులకు పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ) నిర్వహించనున్న యూపీఎస్సీ

న్యూఢిల్లీ : కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్ష -2019, పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ) నిర్వహించేందుకు గాను కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సన్నద్ధమైంది. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2019 (సీఎస్ఈ- 2019) ఎంపికల కోసం కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2,304 మంది అభ్యర్థులకు పర్సనాలిటీ టెస్టులు (పీటీ) / ఇంటర్వ్యూలు నిర్వహించే సమయంలో కోవిడ్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు గాను భారత ప్రభుత్వం లాక్‌డౌన్‌ను ప్రకటించింది. ఈ నేపథ్యంలో కమిషన్ కూడా ఈ విషయాన్ని సమీక్షించి సీఎస్ఈ -2019కి సంబంధించి మిగిలిపోయిన 623 అభ్యర్థులకు పీటీ బోర్డులను 23.03.2020వ తేదీ నుండి వాయిదా వేయాలని నిర్ణయించింది. కోవిడ్ లాక్‌డౌన్ దశల వారీగా ఎత్తివేయడంతో ఈ నెల 20 నుండి 30వ తేదీ వరకు మిగిలిన అభ్యర్థుల కోసం పీటీలను నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. దీనికి సంబంధించి ఆయా అభ్యర్థులందరికీ ముందుగానే తగిన సమాచారం ఇచ్చింది. కమిషన్ అభ్యర్థులు, నిపుణులైన సలహాదారులు మరియు సిబ్బంది యొక్క భద్రత మరియు ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. రైలు సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో పీటీల కోసం వచ్చే అభ్యర్థులకు అతి తక్కువ మొత్తంలో రానుపోను విమాన ఛార్జీలను చెల్లించాలని కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ తాజాగా నిర్ణయించింది. కోవిడ్ నియంత్రితమైన లేదా ఇతర పరిమితం చేయబడిన ప్రాంతాలలో నివసిస్తున్న పీటీల నిమిత్తం ఈ-సమన్ లెటర్స్ జారీ చేసింది. ఈ లెటర్స్ కలిగి ఉన్న అభ్యర్థులు పీటీల నిమిత్తం బయట వెళ్లడానికి అనుమతించాలని కూడా రాష్ట్ర ప్రభుత్వాలను కమిషన్ అభ్యర్థించింది. కమిషన్ అభ్యర్థులకు వారి బస మరియు రవాణా అవసరాలకు తగిన విధంగా సహాయం చేయనుంది. వీరు కమిషన్‌కు చేరుకున్న తర్వాత, అభ్యర్థులందరికీ ఫేస్ మాస్క్, ఫేస్ షీల్డ్, ఒక బాటిల్ శానిటైజర్ మరియు హ్యాండ్ గ్లోవ్స్‌తో కూడిన 'సీల్డ్ కిట్' అందించనున్నారు. ఇంటర్వ్యూ బోర్డులు సాధారణంగా సీనియర్ సలహాదారుల్ని కలిగి ఉంటాయి కాబట్టి, ఇంటర్వ్యూ చేసేవారిని సముచితంగా రక్షించడానికి కమిషన్ కాంటాక్ట్‌లెస్ పీటీల నిమిత్తం అన్ని ముందు జాగ్రత్త మరియు భద్రతా చర్యలను తీసుకుంది. పీటీలను నిర్వహించడంలో పాల్గొనే కమిషన్ సిబ్బందికి కూడా తగిన రక్షణ సామగ్రి ఉంటుంది. అన్ని గదులను, హాళ్లను , ఫర్నిచర్ మరియు సామగ్రిని క్రమం తప్పకుండా శుభ్రపరిచేలా తగిన ఏర్పాట్లు చేశారు.

అన్ని వేదికలలో పీటీ అభ్యర్థుల కోసం సీటింగ్ ఏర్పాట్లు సురక్షితమైన శారీరక దూరాన్ని ఏర్పాటు చేశారు. ఇంటర్వ్యూలకు హాజరు కావడానికి గాను అభ్యర్థులు అనుసరించాల్సిన ప్రొటోకాల్ /మార్గదర్శకలు సంబంధిత అభ్యర్థలకు ఇప్పటికే తెలియజేయబడ్డాయి.

తన పరీక్షల ద్వారా అత్యంత సమర్థులైన అభ్యర్థులను ఎన్నుకోవాలనే రాజ్యాంగబద్ధమైన ఆదేశాన్ని నెరవేర్చడంతో పాటుగా వారి ఆరోగ్య భద్రత యొక్క అత్యున్నత ప్రమాణాలను నిర్ధారించడానికి కమిషన్ కట్టుబడి ముందుకు సాగుతోంది.

# ప్రజల భాగస్వామ్యంతో వైరెస్ నిరోధించవచ్చు : డా. గోపినాథ్





కాకినాడ : కరోనావైరెస్ వ్యాప్తిని నిరోధించడానికి ప్రజల స్వీయ నిర్భందన ఒక్కటే మార్గమని ఏవిధమైన వైద్యము మరియు మందులు లేకపోవడంవల్ల ప్రజలందరు గుర్తించి ఆచరించిననాడు అందరూ ఆరోగ్యంగా జీవనం సాగించేందుకు ఎక్కువ అవకాశం ఉందని వంశి చెస్ట్‌హాస్పటల్ అధినేత డా. గోపీనాథ్ అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ సమావేశం జూమ్ కాన్ఫిరెన్స్ ద్వారా అధ్యక్షులు చోడిశెట్టి పద్దరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.గోపీనాథ్ మాట్లాడుతూ కరోనా వైరెస్ వ్యాధి చికిత్సకు సరైన మందు లేదని అంతేకాకుండా పరిశోధనా ఫలితాలు అందుకోవడానికి మరో సంవత్సర కాలం పట్టే అవకాశం ఉందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు విజయవంతం అవ్వాలంటే ప్రజలందరూ సహకరించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్య అధికంగా ఉన్నప్పటికి భారత దేశంలో భౌగోళిక నైసర్గిక స్వరూపాలతోపాటు ఆహారపు అలవాట్లవల్ల వ్యాధి ఉధృతి ఎక్కువగా లేదని అయినప్పటికి తీసుకోవల్సిన జాగ్రత్తలపట్ల అలసత్వం వహించరాదన్నారు. కాకినాడవంటి ప్రాంతంలో ఈ వైరెస్ ఎక్కువఅవ్వడంపట్ల ఆందోళన చెందుతూ ప్రజలు చూపిస్తున్న అశ్రద్దవల్లే కాంటాక్ట్ వైరెస్ వ్యాపిస్తోందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. ప్రజలు భౌతిక దూరం పాటించకపోవడం, శానిటైజేషన్ విషయంలో శ్రద్ధ తీసుకోకపోవడం ముఖ్యంగా మాస్కులు ధరించకుండా రోడ్లపై చాలామంది సంచరించడం పరిశీలిస్తే భయంవేస్తోందని అన్నారు. ఈ వ్యాధిపట్ల ఇప్పటికైనా తగుజాగ్రత్తలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో మరింతగా పెరిగి ప్రజలలో భయాన్ని, ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కరోనా పరీక్షల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమకూర్చిన సంజీవిని పరీక్షాకేంద్రాలు ప్రజలకు శ్రీరామరక్షగా ఉంటుందని ప్రతీఒక్కరు పరీక్షలు చేయుంచుకోవాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. వైద్యులు తమ ప్రాణాలసైతం పణంగా పెట్టి కరోనా పేషెంట్లకు వైద్యం అందించడం జరుగుతోందని వారికి కూడా కుటుంబాలు ఉంటాయని ప్రజలు ఈ అంశాన్ని గుర్తించుకోవల్సిందిగా కోరారు. బలవర్ధకమైన ఆహారాన్ని స్వీకరిం చడంద్వారా ఈ వైరెస్ వ్యాప్తిని మనదేహం నివారించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. చిన్నపిల్లలు వృద్దులు ఎట్టి పరి స్థితుల లోను ఇంటిబయట తిరగడానికిఅనుమతించవద్దని సాధ్యమైనంతవరకు వారి వారి గృహాలలోనే ఉండడం క్షేమకరమన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కరోనా వైరెస్‌పట్ల తీసుకో వల్సిన జాగ్రత్తలు రోజుకు సుమారు 30సార్లు కార్పొ రేషన్ ప్రసార మాధ్యమం ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తోందని అయినప్పటికి ప్రజలు నిర్లక్ష్యం వహిం చడం మంచిదికాదన్నారు. ప్రసార మాధ్యమాలలో నిత్యము వైరెస్‌బారినపడి మృత్యువాతపడుతున్న వ్యక్తుల తాలుకు కుటుంబాలు పడుతున్న బాధలు మనం గమనిస్తున్నప్పటికి అటువంటి సంఘటనలు మనకు సంభవించరాదని ప్రతీఒక్కరు కోరుకోవల్సిందిగా సూచించారు.

కొద్దిరోజులపాటు ఇళ్ళలోనే ఉంటు వైరెస్ వ్యాప్తిని నిరోధించడానికి సహకరిస్తే ఆ కుటుంబంతోపాటు సమాజానికి ఎంతో మేలుచేసిన వారవుతారని దయవుంచి వైద్యుల విన్నపాలను ఆచరణలో పెట్టవల్సిందిగా ఆయన విజ్ఞప్తిచేసారు. ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు ఇతర మందుల తయారీదారులు చేస్తున్న పరిశోధనలు సత్ఫలితాలన్న ఆకాంక్షను డా. గోపీనాథ్ వ్యక్తం చేశారు. వారియర్స్‌గా ఉంటున్న వైద్యులు, పారిశుధ్య సిబ్బంది, పోలీసులు మరియు జర్నలిస్టుల ఆరోగ్య జీవనానికి ప్రజలందరు తమ వంతు బాధ్యతను నెరవేర్చడంద్వారా వైరెస్ వ్యాప్తిని అరి కట్టేందుకు ఎంతో అవకాశం ఉందని డా. గోపీనాథ్ పునరు ద్ఘాటించారు.

జూమ్ క్లబ్ సమావేశంలో క్లబ్ అధ్యక్షులు పద్దరాజు, కార్యదర్శి కె.వి.టి. నారాయణ రావు (నాని), కోశాధికారి సత్తి రవిరెడ్డి, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు కె.వి.ఎస్. ఆంజనేయమూర్తి, డా. ఎస్.వి.ఎస్. రావు, ఉదయభాను, వెత్సా ఆనంద్, ముంజులూరి విశ్వేశ్వరరావు,జి.కె. శ్రీనివాస్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

### ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా

# కఠిన చర్యలు తీసుకోవాలి

**- మైనర్ బాలికకు న్యాయం చేయాలి**

**- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ**



రాజమహేంద్రవరం : రాజానగరం నియోజకవర్గం మధురపూడిలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం చాలా దురదృష్టకరమైన సంఘటనని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు జరిగితే అందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో హెచ్చుస్థాయిలో ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటువంటి సంఘటనలు మరలా పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సూచించారు. మైనర్ బాలికపై మూడురోజులుగా సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఏడుగురి నిందితుల పైనా దిశ చట్టం కింద కేసు నమోదు చేసి బాధితురాలికి సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దిశ చట్టం అమల్లోకి వచ్చి ఉంటే మరింత మెరుగ్గా ఆ అమ్మాయికి న్యాయం జరిగి ఉండేదని, ఇప్పటికైనా సరే ప్రభుత్వం దిశ పథకం, ఇతరతర పథకాలు అని కాకుండా దిశ చట్టం తీసుకువచ్చి ఇటువంటి సంఘటనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమ్మాయిల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని దురాగతాలకు పాల్పడటం దురదృష్ట కరమన్నారు. అత్యాచారంపై కేసు నమోదు విషయంలో పోలీసుల నిర్లక్ష్యం కూడా ఉందని దానిపై లోతుగా విచారణ చేపడతామని ఏపీ మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని, దానిపై కూడా వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళలు, యువతులపై ఈ రకమైన ఘటనలు నిత్య కృత్యంగా మారాయని విచారం వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేస్తున్న మహిళలకు రక్షణ మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు, అమ్మాయిలకు, పసి మొగ్గలకు కూడా రక్షణ లేని పరిస్థితులు దాపురించాయని పేర్కొన్నారు. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఏడుగురు నిందితుల పైనా, ఉపాధి చూపిస్తాను అని చెప్పి మైనర్ బాలికను వారికి అప్పగించి ఈ ఘటనకు కారకులైనా దిశ చట్టం కింద కేసు నమోదు చేసి, వారికి తక్షణం శిక్ష పడే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి, ఆమె కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే భవానీ డిమాండ్ చేశారు.

## 'రాణి'ని దత్తత తీసుకున్న ఉపాసన కొణిదెల

**ఏడాది కాలానికి ఏనుగు దత్తత**

**రూ.5 లక్షల చెక్ అందజేసిన ఉపాసన**



హైదరాబాద్: నెహ్రూ జూలాజికల్ పార్కులోని 'రాణి' అనే ఏనుగును అపోలో ఫౌండేషన్, అపోలో లైఫ్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల ఏడాది కాలానికి దత్తత తీసుకున్నారు. సోమవారం జూ పార్కును సందర్శించిన ఆమె రాణిని ఏడాది పాటు దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించి దాని పోషణకు అయ్యే ఖర్చు నిమిత్తం రూ. 5 లక్షల చెక్‌ను క్యూరేటర్, ఐఎఫ్ఎస్ అధికారిని క్షితిజకు అందజేశారు. ఈ సందర్భంగా క్యూరేటర్ క్షితిజ మాట్లాడుతూ... జూపార్కులో వన్యప్రాణుల సంరక్షణ బలోపేతం చేయడంలో భాగంగా ఉపాసన కొణిదెల చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. అడవి జంతువుల పరిరక్షణలో ఉపాసన కృషి అభినందనీయమన్నారు. ఉపాసన నిబద్ధత చాలా మందికి ప్రేరణగా నిలుస్తుందని చెప్పారు.

కరోనా కాలంలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కులో జంతువులను దత్తత తీసుకోవడానికి ఎక్కువ మంది ముందుకు వస్తారని క్షితిజ ఆశాభావం వ్యక్తం చేశారు. నేడు ఉపాసన పుట్టినరోజు కావడం విశేషం.

## డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించిన జివియంసి కమిషనర్ డా.సృజన



విశాఖపట్నం : జి.వి.యం.సి. ప్రధాన కార్యాలయం సమావేశపు మందిరం నుండి డయల్ యువర్ కమీషనర్ ప్రోగ్రాంను కమీషనర్ డా. సృజన టోల్ ఫ్రీ నెం.1800-4250-0009 ద్వారా ఉదయం 10.00 గం. నుండి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా ప్రజలనుండి విజ్ఞప్తులు స్వీకరించారు. స్వీకరించిన విజ్ఞప్తులను స్వయంగా పరిష్కరించి తగు నివేదిక సమర్పించే నిమిత్తం ఆయా విభాగాల అధికారులను/జోనల్ కమీషనర్లకు పంపించారు. ఇందులో 1వ జోన్ కు సంబందించి 3, 2 వ జోన్ కు సంబందించి 4, 3 వ జోన్ కు సంబందించి 2, 4 వ జోన్ కు సంబందించి 1, 5వ జోన్ కు సంబందించి 4, 6వ జోన్ కు సంబందించి 4, పి.డి. (యు.సి.డి) 1 మొత్తం 19 పిర్యాదులు ఫోన్ ద్వారా స్వీకరించారు.

కమీషనర్ ప్రధాన కార్యాలయ విభాగపు ఉన్నతాధికారులతోను, జోనల్ కమీషనర్లతోనూ మాట్లాడుతూ డయల్ యువర్ కమీషనర్ లో స్వీకరించిన పిర్యాడులతో పాటూ, స్పందన కార్యక్రమాలలో స్వీకరించిన పిర్యాదులు, మున్సిపల్ పరిపాలన శాఖ వెబ్ సైట్ ద్వారా స్వీకరించిన పిర్యాదులు 3 రోజులలో పరిష్కరించేందుకు గాను తగు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అధనపు కమీషనర్లు, రమణి, సన్యాసిరావు, సి.సి.పి. విద్యుల్లత, డి.సి.ఆర్. ఫణిరాం, ఇ.ఓ.ఎ. మంగపతిరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## 127 ఏళ్ల స్కూల్ చరిత్రను తిరగరాసిన పదో తరగతి విద్యార్థిని



విశాఖసిటీ : పదో తరగతి ఐ సీ ఎస్ ఈ , పరీక్షా ఫలితాల్లో, సెయింట్ జోసెఫ్ గర్ల్స్ హై స్కూల్, జ్ఞానాపురం లో చవుతున్న యోచన ప్రీతి అనే విద్యార్థిని నూతన స్కూల్ రికార్డ్ నెలకొల్పింది. ఈ ఏడాది మార్చ్ లో జరిగిన పదో తరగతి ఐ సీ ఎస్ ఈ విభాగంలో జీ. యోచన ప్రీతి అనే బాలిక 600 మార్కులకు గాను 582 (97%) మార్కులు సాధించి, ఇప్పటివరకు స్కూల్ పేరిట ఉన్న రికార్డ్ లను తిరగరాసింది. గతంలో 96% శాతం మార్కులు ఈ స్కూల్ రికార్డ్ గా ఉండేది. బాలిక తండ్రి జీ.వి. మహేష్ కుమార్ విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ ఉద్యోగి. పోర్ట్ ఉద్యోగి కుమార్తె 10 తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడం పట్ల పోర్ట్ డెప్యూటీ చైర్మన్ పి. ఎల్. హరనాథ్ సంతోషం వ్యక్తం చేశారు.

భవిష్యత్తులో మరింత ప్రతిభ చూపి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అయన బాలికను దీవించారు. స్కూల్ యాజమాన్యం యోచన ప్రీతి ప్రతిభ పై హర్షం వ్యక్తం చేసింది.

### ఇద్దరు మంత్రుల రాజీనామాలకు

# గవర్నర్ ఆమోదం



విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ రాజీనామాలకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆమోదం తెలిపారు. ఇటీవల రాజ్యసభకు ఎంపికైన నేపథ్యంలో వీరిద్దరు తమ మంత్రి పదవులకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తాజాగా వాటిని ఆమోదిస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు ఈ నెల 22న పిల్లి సుభాష్‌చంద్రబోష్, మోపిదేవి వెంకటరమణ రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేయనున్నారు.

## శారదా పీఠాధిపతులను కలిసిన వీహెచ్‌పీ నేత



రుషికేశ్: విశ్వహిందూ పరిషత్ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి రాఘవులు సోమవారం రుషికేశ్‌లో విశాఖ శారదా పీఠాధిపతులను కలిశారు. స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర ఆశీస్సులు అందుకున్నారు. పీఠాధిపతులు చేపట్టిన చాతుర్మాస్య దీక్ష వివరాలను అడిగి తెలుసుకున్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం గురించి ఈ సందర్భంగా చర్చించారు. రామ మందిరం భూమి పూజ వివరాలను పీఠాధిపతులకు వివరించారు. నిర్మాణానికి స్వామిజీ ఆశీస్సులు ఉండాలని కోరారు.

రామ మందిర నిర్మాణం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. రామ మందిర నిర్మాణంపై ప్రధాని మోదీ దృఢ సంకల్పంతో ఉన్నారని వివరించారు.

## కోవిడ్ వారియర్స్ గా గుర్తించి సన్మానం



విశాఖపట్నం : బ్యాంక్ ఆఫ్ బరోడా వారు , బ్యాంక్ ఆఫ్ బరోడా113 వ వ్యవస్థాపక దినోత్సవము పురస్కరించుకుని కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయములో తమ నిరుపమాన సేవలందిస్తూ సమాజానికి వెన్నెముకగా నిలుస్తున్న వివిధ రంగాలకు చెందిన వ్యక్తులకు కోవిడ్ వారియర్స్ గా గుర్తించి సన్మానించడం జరిగినది. నగర పోలీసు శాఖకు చెందిన వై.గోవింద రావు, ఏ.సి.పి (సిటీ స్పెషల్ బ్రాంచ్) , జి.రాజా నాయుడు, పి.సి-3933 లను కోవిడ్ వారియర్స్ గా గుర్తించి సన్మానించడం జరిగింది.

## ప్రతి నియోజక వర్గ పరిధిలో కోవిడ్ కేర్ సెంటర్ల ఏర్పాటు

### జిల్లా కలెక్టర్ వి వినయ్ చంద్





విశాఖపట్నం : కోవి డ్ నియంత్రణకు సంబంధించి ప్రతి నియోజక వర్గ పరిధిలో కోవిడ్ కేర్ సెంటర్ల ఏర్పాటు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి వినయ్ చంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఏ ఎం సీ సమావేశ మందిరములో ఏఎం సి ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, డిఎం& హెచ్ ఓ డాక్టర్ తిరుపతి రావు, డి ఆర్ వో ఎం శ్రీదేవి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ రావు, డీ అర్ డీ ఏ పీ డీ విశ్వేశ్వరరావు తదితరులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలలో కరోనా వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో నియోజక వర్గ పరిధిలో కోవిడ్ కేర్ సెంటర్ల ఏర్పాటు శీఘ్ర గతిన ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి సెంటర్లో 300 పడకలకు తక్కువ కాకుండా సిద్ధం చేయాలన్నారు. సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు ఇంఛార్జి లు గా వ్యవహరించాల్సి వుంటుందన్నారు.ప్రతీ సెంటర్ వద్ద అంబులెన్స్ ను అందుబాటులో ఉంచాలన్నారు. అవసరాన్ని బట్టి పాజిటివ్ పేషంట్స్ ను ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ హాస్పిటల్స్ కి షిఫ్ట్ చేయాలన్నారు.

అనంతరం కలెక్టరు కే జి హెచ్ లో కోవి డ్ కేర్ టెస్టింగ్ ల్యాబ్ ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితి పై తీవ్ర అసంతృప్తి ని వ్యక్త పరిచారు. టెస్టింగ్ శాంపిల్స్ వి ఆర్ డీ ఎల్, వి టీ ఎం ఎస్, ఆర్ టీ పీ సీ ఆర్ మిషన్ ద్వారా చేసే పరీక్షలు కు సంబంధించి రిపోర్ట్ ఆలస్యం చేస్తున్న నేపథ్యంలో సంబంధిత డాక్టర్స్, సిబ్బంది పై కలెక్టర్ అసహనం వ్యక్త పరిచారు. టెస్ట్ రిజల్ట్ ను 24 గంటల లోగా పంపించాల ని, ఆలస్యమైన పక్షంలో సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

## ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసులకు కోవిడ్ పరీక్షలు



కంచరపాలెం, ఇటివలే ఎయిర్ పోర్ట్ జోన్ సి.ఐ కి కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో ఎయిర్ పోర్ట్ జోన్ పోలీసు స్టేషన్ ఎస్ .ఐ లతో పాటుగా సుమారు 50 మంది సిబ్బంది సోమవారం సాయంత్రం ఆర్ .అండ్ .బి కూడలి వుడా కోలని వద్ద నున్న ఎయిర్ పోర్ట్ జోన్ పోలీసు స్టేషన్ ఆవరణలో కోవిడ్ పరిక్షలు నిర్వహించుకున్నారు .

ఈమేరకు స్టేషన్ వెలుపల , పరిసర ప్రాంతల్లో హైపో క్లోరిన్ ద్రావణంతో పిచికారి చేపట్టారు .

## డిసెంబరు కల్లా వ్యాక్సిన్ అభివృద్ధిలో ఏడు దేశీయ సంస్థలు

దిల్లీ : ఈ ఏడాది చివరికి కొవిడ్-19 వ్యాక్సిన్ వచ్చే అవకాశం ఉందని సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అంచనా వేస్తోంది. 'ప్రస్తుతం మూడో దశ క్లినికల్ ట్రయల్స్ జరుపుకుంటున్న ఆస్ట్రాజెనెకా ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్‌పై పనిచేస్తున్నాం. వచ్చే నెలలో భారత్‌లో సైతం మనుషులపై ప్రయోగాలు ప్రారంభిస్తాం. ప్రస్తుత పరిస్థితులు, ప్రయోగాత్మక పరీక్షల ఫలితాలను చూస్తే.. ఏడాది చివరికి ఆస్ట్రాజెనెకా ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది' అని సీరమ్ ఇన్‌స్టిట్యూట్ సీఈఓ అదార్ పూనావాలా పేర్కొన్నారు. అమెరికాకు చెందిన బయోటెక్ సంస్థ కొడాజెనిక్స్‌తో కలిసి సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆస్ట్రాజెనెకా, కొడాజెనిక్స్‌లతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, ఆస్ట్రియాకు చెందిన థెమిస్, మరో రెండు సంస్థలు ఇందులో ఉన్నాయని పూనావాలా అన్నారు. ఆక్స్‌ఫర్డ్ అభివృద్ధి చేస్తున్న కొవిడ్-19 వ్యాక్సిన్‌ను 100 కోట్ల డోసుల ఉత్పత్తి, సరఫరా నిమిత్తం ఆస్ట్రాజెనెకాతో తయారీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ఈ వ్యాక్సిన్‌లు భారత్‌తో పాటు తక్కువ ఆదాయం ఉన్న దేశాల్లో లభిస్తాయని స్పష్టం చేశారు.

నెలల వ్యవధిలోనే: ప్రస్తుతం ఏడు భారత ఔషధ సంస్థలు కొవిడ్ వ్యాక్సిన్ అభివృద్ధికి రేయింబవళ్లు శ్రమిస్తున్నాయి.వాస్తవానికి వ్యాక్సిన్ పరీక్షలు, ఉత్పత్తి చేయడానికి కొన్నేళ్ల సమయం పడుతుంది. కానీ నెలల వ్యవధిలోనే తీసుకురావడానికి శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com